వాస్తవాలు పలుకు DD9 వార్త

TGTEL/26/A2635

తెలుగు దినపత్రిక

సంపుటి: 06 | సంచిక: 150 | 12-10-2026 | సోమవారం | పేజీలు: 10 | వెల: 3/-



## శివాజీని మతానికి పరిమితం చేయొద్దు

- పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి వెల్లడి
- సంగారెడ్డి బైపాస్ రోడ్డులో విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ
- చరిత్రను రాజకీయాలకు వాడుకుంటున్నారని బీజేపీపై విమర్శ
- శివాజీ సైన్యంలో ముస్లిం అధికారులు కూడా ఉన్నారని వెల్లడి
- కులమతాల కంటే ప్రజల

2



2

## గోవాను డ్రగ్స్ అడ్డాగా మార్చేశారు

- బీజేపీ పాలనలో గోవా ప్రజలకు తీవ్ర అన్యాయం
- కార్పొరేట్ల చేతుల్లోకి భూములు వెళ్లకుండా కాపాడుకోవాలి
- ఉపాధి లేక నిరాశలో గోవా యువత
- డ్రగ్స్‌కు అడ్డాగా గోవా మారింది
- ప్రధాన నగరాలకు గోవా నుంచే మాదకద్రవ్యాల సరఫరా
- గోవా అస్తిత్వాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత: రేవంత్ రెడ్డి



2

## కౌకూర్‌లో ఆరేళ్ల బాలుడి హత్య.. రూ.20 లక్షల కోసం కిడ్నాప్!

- ఆడుకుంటూ కనిపించకుండా పోయిన మోజెస్ అరులియా
- క్లబ్‌హౌస్ సంపులో చిన్నారి మృతదేహం
- కాళ్లు, చేతులు కట్టేసిన స్థితిలో బాలుడు
- కుటుంబానికి ఫోన్ చేసి రూ.20 లక్షలు డిమాండ్
- వాచ్‌మెన్ విక్రమ్‌పై అనుమానాలు
- పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసుల గాలింపు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు
- సికింద్రాబాద్‌లో కలకలం రేపిన ఘటన
- కిడ్నాప్, హత్య వెనుక కారణాలపై దర్యాప్తు



## ‘సర్’ పేరుతో మైనారిటీల ఓట్ల తొలగింపు

- 13 కోట్ల ఓట్లు తొలగించారని ఆరోపణ
- ఎన్నికల సంఘం తీరుపై బీఆర్ఎస్ నేత విమర్శలు
- మైనారిటీల హక్కులను కాలరాస్తున్నారని వ్యాఖ్య
- ఢిల్లీలో నిరసనలను అణచివేస్తున్నారని ఆరోపణ
- ఇంటర్నెట్ నిలిపివేత, రహదారుల మూసివేతపై విమర్శలు
- తెలంగాణలోనూ ఇదే కుట్ర జరిగే ప్రమాదం ఉందని వ్యాఖ్య
- మైనారిటీలంతా ఏకమై అడ్డుకోవాలని పిలుపు
- సిద్దిపేటలో మైనారిటీల సమావేశంలో కేటీఆర్ ప్రసంగం
- కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘంపై ధ్వజం

**హైదరాబాద్, (డీడీ9 వార్త):**

‘సర్’ పేరుతో మైనారిటీల ఓట్లను తొలగించేందుకు ఎన్నికల సంఘం కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఇది మైనారిటీల ఓటు హక్కులను కాలరాసే ప్రయత్నమని విమర్శించారు. ఆదివారం సిద్దిపేటలో నిర్వహించిన మైనారిటీల సమావేశంలో పాల్గొన్న ఆయన కేంద్ర ప్రభుత్వంతోపాటు ఎన్నికల సంఘం తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. ‘సర్’ పేరుతో ఇప్పటివరకు 13 కోట్ల మంది మైనారిటీల ఓట్లను తొలగించారని కేటీఆర్ ఆరోపించారు. ఈ పరిణామాలపై దేశ రాజధాని ఢిల్లీలో యువత ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు మిగతా 2 లో..

## ఎల్‌నినో ఎఫెక్ట్.. రెండో పంట వేయొద్దు!

- తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంతో కరువు ముప్పు
- రెండో పంట వేయొద్దంటూ రైతులకు మంత్రి విజ్ఞప్తి
- యూనిట్ రూ.15 పెట్టినా దొరకని విద్యుత్
- నీటి ఎద్దడిపై ప్రత్యేక కేబినెట్ భేటీ
- రాష్ట్రంలో తీవ్ర వర్షాభావం.. నీటి ఎద్దడి ప్రమాదం
- సాగునీటితో పాటు తాగునీటికీ కష్టాలు తప్పవు
- మొదటి పంటను వంద శాతం కాపాడుకుంటాం
- యాసంగి సాగుకు దూరంగా ఉండండి
- రైతులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి



**హైదరాబాద్, (డీడీ9 వార్త):**

రాష్ట్రంలో రానున్న కాలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు, నీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలో నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా ప్రభావం చూపుతున్న ‘ఎల్‌నినో’ (El Nino) పరిస్థితుల కారణంగా రాష్ట్రంలో సాగు నీటితో పాటు మిగతా 2 లో..

## ఒకే వేదికపై మోదీ, విజయ్

- రూ.13 వేల కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం
- చెన్నైలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రధాని, సీఎం
- చెన్నై మెట్రో ఫేజ్-2 మార్గం ప్రారంభం
- పూనమల్లి నుంచి పోరూర్ వరకు మెట్రోలో ప్రయాణం
- యూపీఐతో టికెట్ కొనుగోలు చేసిన మోదీ
- తమిళనాడు అభివృద్ధికి కేంద్రం సహకరిస్తుందని ప్రధాని హామీ
- మెట్రో ఫేజ్-3 పాడిగింపునకు విజయ్ విజ్ఞప్తి
- చెన్నై–కన్యాకుమారి హైస్పీడ్ రైలుకు ప్రతిపాదన
- ఎలక్ట్రానిక్స్ ఎగుమతుల్లో భారత్ పురోగతిపై మోదీ ప్రశంసలు
- తూత్తుకుడి పోర్టును గ్రీన్ ఎనర్జీ హబ్‌గా అభివృద్ధి చేసే ప్రణాళిక



**హైదరాబాద్, (డీడీ9 వార్త):**


తెలంగాణలో ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపునకు సంబంధించిన ప్రింటెడ్ ఫారం 7 దరఖాస్తులు కలకలం రేపుతున్నాయి. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో ఇలాంటి దరఖాస్తులు వెలుగులోకి వచ్చాయి. సాధారణంగా చేతిరాతతో వచ్చే ఫారం7 దరఖాస్తులు.. ఇక్కడ ఓటర్ల వివరాలను ముందే ప్రింట్ చేసి కట్టలుగా బూత్ లెవల్ అధికారులకు అందిస్తున్నట్లు గుర్తించారు. దీంతో ఈ దరఖాస్తులు ఎక్కడి నుంచి వస్తున్నాయి? ఎవరు ప్రింట్ చేస్తున్నారు? బీఎల్‌వోలకు ఎవరు అందిస్తున్నారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ ఎన్నికల విభాగం నేతలు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డికి ఫిర్యాదు చేశారు.

తమిళనాడు అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. రాష్ట్రాల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్‌తో కలిసి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. చెన్నైలో ఆదివారం నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఇద్దరు నేతలు ఒకే వేదికను పంచుకున్నారు. ఈ సందర్భంగా రూ.13,000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

చెన్నై ట్రేడ్ సెంటర్, ఐఐటీ మద్రాస్ ఆవరణలోని కేంద్రీయ విద్యాలయ గ్రౌండ్స్‌లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్రంలో రవాణా, మౌలిక వసతులు, మిగతా 2 లో..

## డేటా లీక్‌లను అరికట్టాలి

- డేటా రక్షణకు అత్యంత ప్రాధాన్యం
- గోప్యత, డిజిటల్ భద్రత కీలకం
- బాధ్యతాయుత ఏఐ వినియోగం అవసరం
- పారదర్శకత, జవాబుదారీతనం ముఖ్యం
- హైదరాబాద్‌లో బిలియన్స్ ఏఐ సెంటర్ ప్రారంభం
- విద్యలో సాంకేతికతతో మెరుగైన ఫలితాలు
- విద్యార్థులకు ఏఐ ఆధారిత పరిష్కారాలు
- ప్రాక్టీస్, లెర్నింగ్‌కు ఎడ్యుటెక్ వినియోగం
- నీట్ పేపర్ లీక్ తర్వాత డేటా భద్రతపై దృష్టి
- ఎడ్యుటెక్‌ను ఉపయోగిస్తున్న పిల్లల్లో 77 శాతం మంది అభ్యాసం కోసమే వినియోగం



**హైదరాబాద్, (డీడీ9 వార్త):**

డేటా రక్షణ, గోప్యతకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు తెలిపారు. డిజిటల్ వ్యవస్థలను సురక్షితంగా ఉంచడంతోపాటు వ్యక్తిగత సమాచార గోప్యతను కాపాడటం కీలకమని చెప్పారు. ముఖ్యంగా డేటా సెంటర్ల ఏర్పాటులో భద్రత, గోప్యతకు పెద్దపీట వేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో బిలియన్స్ ఏఐ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. కృత్రిమ మేధ (ఏఐ) సాధనాలను వినియోగించేటప్పుడు అవి ఎంత బాధ్యతాయుతంగా పనిచేస్తున్నాయో పరిశీలించాలని శ్రీధర్‌బాబు సూచించారు. ఏఐ వినియోగంలో బాధ్యత, పారదర్శకత, జవాబుదారీతనం అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. సాంకేతికత వల్ల కలిగే ప్రయోజనాలను అందిపుచ్చుకోవడంతోపాటు దాని వినియోగంతో మిగతా 2 లో..

## విమానంలోకి వచ్చి కిడ్నాప్ చేశారు

- విడుదలైన తర్వాత సీజేపీ నేతల మీడియా సమావేశం
- ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని సౌరవ్ దాస్ ఆరోపణ
- ఫోన్లు స్వాధీనం చేసుకున్నారని వెల్లడి
- న్యాయవాదిని సంప్రదించేందుకు అనుమతించలేదని వ్యాఖ్య
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను ఎందుకు కాపాడుతున్నారని ప్రశ్న
- ఢిల్లీలో ఎమర్జెన్సీ తరహా పరిస్థితులున్నాయని విమర్శ
- నిరసనలకు సంబంధించి 20 కేసులు నమోదు చేసిన పోలీసులు
- 15 మందికి పైగా పోలీసులకు గాయాలు
- భద్రతా సిబ్బందిపై దాడి, విధులకు ఆటంకంపై కేసులు



**న్యూఢిల్లీ, (డీడీ9 వార్త):**

దిల్లీ పోలీసులు విమానంలోకి బలవంతంగా ప్రవేశించి తమను కిడ్నాప్ చేశారని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధి సౌరవ్ దాస్ మిగతా 2 లో..

## చౌటుప్పల్‌లో కిలోమీటరు మేర ట్రాఫిక్ జామ్

- హైదరాబాద్–విజయవాడ హైవేపై వాహనాల బారులు
- ఫ్లైఓవర్ నిర్మాణంతో రాకపోకలకు అంతరాయం
- పండుగ సెలవులతో పెరిగిన వాహనాల రద్దీ
- లక్కారం నుంచి ధర్మోజీగూడెం వరకు నిలిచిన వాహనాలు
- యూటర్న్ కోసం రెండు కిలోమీటర్లు వెళ్లాల్సిన పరిస్థితి
- రోడ్డు దాటేందుకు పాదచారుల ఇబ్బందులు
- వాహనదారులకు తప్పని ట్రాఫిక్ కష్టాలు
- సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు అవస్థలు



**న్యూఢిల్లీ, (డీడీ9 వార్త):**

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పరిధిలోని హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ కొనసాగుతోంది. ఫ్లైఓవర్ నిర్మాణ పనులకు తోడు పండుగ సెలవుల నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య పెరగడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారింది. లక్కారం నుంచి మిగతా 2 లో..

# ఎల్‌నినో ఎఫెక్ట్.. రెండో పంట వేయొద్దు!

**మొదటిపేజీ తరువాయి**

రాబోయే రోజుల్లో తాగునీటికి కూడా తీవ్ర ఇబ్బందులు తలెత్తే అపకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పొలాల్లో ఉన్న మొదటి పంటను ఎలాగైనా కష్టపడి వంద శాతం కాపాడుకుంటామని, అయితే రైతులు ఎవరూ కూడా దయచేసి రెండో పంట (యాసంగి/వేసంగి) వేయ వద్దని ఆయన ప్రభుత్వం తరఫున విజ్ఞప్తి చేశారు.

**విద్యుత్ కొనుగోలు భారంగా మారింది..**

రాష్ట్రంలో తలెత్తబోయే విద్యుత్ సంక్షోభం, కరెంటు ఇబ్బట్లపై మంత్రి పొంగులేటి స్పష్టతనిచ్చారు. పవర్ గ్రిడ్‌లో డిమాండ్‌కు తగినట్లుగా విద్యుత్ సరఫరా చేయడం కష్టంగా మారుతోందని, విద్యుత్‌ను బయటి మార్కెట్ నుంచి కొనుగోలు చేయాలంటే యూనిట్‌కు రూ. 15 వెచ్చించినా దొరకని దయనీయ పరిస్థితి నెలకొందని తెలిపారు. అందువల్ల ప్రజలందరూ కూడా విద్యుత్‌ను అత్యంత పొదుపుగా వాడుకోవాలని కోరారు. ఒకవేళ రైతులు ఎవరైనా రెండో పంట వేస్తే.. అటు ప్రభుత్వం నీటిని, విద్యుత్‌ను సరఫరా చేయలేక సతమతమవుతుందని, ఇటు రైతులు తీవ్రంగా నష్టపోయి ఆర్థికంగా బాధపడాల్సి వస్తుందని ఆయన హితవు పలికారు. రైతులు ఈ పరిస్థితులను అర్థం చేసుకుని ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.

**నేడు, రేపు కేబినెట్ భేటీ..**

**కేంద్రం పాత్రపై చర్చ**

వర్షాభావ పరిస్థితులు, తాగుసాగు నీటి ఎద్దడి, విద్యుత్ కొరతను సమర్థవంతంగా ఎలా ఎదుర్కోవాలో చర్చించేందుకు రేపు, ఎల్లుండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రివర్గ ప్రత్యేక సమావేశం (Cabinet Meeting) జరగనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ కేబినెట్ భేటీలో సంక్షోభ నివారణకు ప్రత్యామ్నాయ చర్యలపై చర్చిస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పెద్దన్న పాత్ర పోషించి కరువు నివారణకు, రాష్ట్రానికి అండగా నిలవాలని ఈ సమావేశంలో తీర్మానించి విజ్ఞప్తి చేస్తామన్నారు. త్వరలోనే అన్ని రాజకీయ పార్టీల నేతలతో అఖిలపక్ష సమావేశం (AllParty Meeting) ఏర్పాటు చేసి, ఎల్‌నినో ప్రభావంపై వారి నుంచి విలువైన సలహాలు, సూచనలు స్వీకరిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఒకే వేదికపై మోదీ, విజయ్

**మొదటిపేజీ తరువాయి**

పారిశ్రామిక రంగాల అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టులను నేతలు ప్రారంభించారు.

**చెన్నై మెట్రో ఫేజ్-2 ప్రారంభం**

చెన్నై మెట్రో రైలు ప్రాజెక్టు రెండో దశలో కారిడార్ 4కు చెందిన పూనమల్లి-వడపళని మార్గాన్ని ప్రధాని మోదీ, సీఎం విజయ్ కలిసి ప్రారంభించారు. సుమారు 15 కిలోమీటర్ల పొడవున 11 స్టేషన్లతో ఉన్న ఈ మార్గం నగరంలో ప్రజా రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంలో కీలకంగా నిలవనుంది. ప్రారంభోత్సవం అనంతరం మోదీ, విజయ్ కలిసి పూనమల్లి బైపాస్ నుంచి పోరూర్ వరకు మెట్రో రైలులో ప్రయాణించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ప్రయాణికులతో ముచ్చటించారు. ప్రధాని మోదీ యూపీఐ ద్వారా మెట్రో టికెట్ కొనుగోలు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**ఎలక్ట్రానిక్స్ రంగంలో**

**తమిళనాడు పాత్ర కీలకం**

భారత తయారీ రంగం అభివృద్ధిలో తమిళనాడు కీలక పాత్ర పోషిస్తోందని మోదీ ప్రశంసించారు. దేశంలో ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి, ఎగుమతులు గణనీయంగా పెరుగుతున్నాయని పేర్కొన్నారు. 2014తో పోలిస్తే భారత ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 11 రెట్లు పెరిగాయని, ప్రపంచంలో రెండో అతిపెద్ద మొబైల్ తయారీ దేశంగా భారత్ ఎదిగిందని తెలిపారు.

పారిశ్రామిక ఉత్పత్తి, సాంకేతిక రంగాల్లో మరింత పురోగతి సాధించేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. తమిళనాడులో ఉన్న తయారీ పరిశ్రమలు దేశ ఆర్థిక వ్యవస్థకు బలాన్ని అందిస్తున్నాయని వివరించారు.

**తూత్తుకుడి పోర్టు అభివృద్ధిపై దృష్టి**

తూత్తుకుడిలోని వి.ఓ. చిదంబరనార్ పోర్టును ప్రపంచస్థాయి గ్రీన్ ఎనర్జీ, భారీ కంటైనర్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ప్రధాని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి రూ.17,000 కోట్ల విలువైన పనులను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. పోర్టు సామర్థ్యం పెరగడం ద్వారా సముద్ర వాణిజ్యం, సరుకు రవాణా, పారిశ్రామిక కార్యకలాపాలకు ఊతం లభిస్తుందని వివరించారు.

**మెట్రో విస్తరణకు విజయ్ విజ్ఞప్తి**

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులకు కేంద్రం సహకరించాలని కోరారు. చెన్నై మెట్రో ఫేజ్ 3 విస్తరణ ప్రతిపాదనలకు తక్షణమే ఆమోదం తెలపాలని ప్రధానిని విజ్ఞప్తి చేశారు. ఎయిర్‌పోర్ట్-కిల్‌పాక్కం, పూనమల్లి-సుంగువార్‌సత్రం మార్గాల్లో మెట్రో సేవలను విస్తరించాల్సిన అవసరం ఉందని వివరించారు. అలాగే చెన్నై-కన్యాకుమారి, చెన్నై-కోయంబత్తూర్ మార్గాల్లో హైస్పీడ్ రైలు కారిడార్లను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టులు అమలైతే రాష్ట్రంలోని ప్రధాన నగరాల మధ్య ప్రయాణ సమయం తగ్గడంతోపాటు ఆర్థిక కార్యకలాపాలకు మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం అవసరమని విజయ్ అన్నారు. మౌలిక వసతుల విస్తరణ, రవాణా సదుపాయాల మెరుగుదల, పారిశ్రామిక అభివృద్ధి వంటి అంశాల్లో పరస్పర సహకారంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# గోవా–హైదరాబాద్ డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు..

- **గోవాలో ప్రధాన నిందితుడు క్రిస్టీ అరెస్ట్**
- **రూ.48.4 లక్షల అనుమానాస్పద లావాదేవీలు**
- **ఏటీఎంల ద్వారా నగదు బదిలీ చేసినట్లు గుర్తింపు**
- **నైజీరియన్ నిగి పాత్రపై పోలీసుల దర్యాప్తు**



**హైదరాబాద్, (డీడీ9 వార్త):**

గోవా నుంచి హైదరాబాద్‌కు గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న డ్రగ్స్ సరఫరా నెట్‌వర్క్‌ను పోలీసులు భగ్నం చేశారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో 'ఈగల్ ఫోర్స్' (EAGLE Force), హైదరాబాద్ సిటీ పోలీసులు బోయింగ్‌పల్లి పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ప్రతిష్టాత్మక ఆపరేషన్‌లో గోవాకు చెందిన ప్రధాన డ్రగ్ పెడ్లర్ క్రిస్టీ (క్రస్టోడియో ఫెర్నాండెజ్) పోలీసులకు చిక్కాడు. గోవాలో అజ్ఞాతంలో ఉన్న నిందితుడిని స్థానిక పోలీసుల సహకారంతో అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. పంజాగుట్టలో ఇటీవల అరెస్టయిన నిందితుడు కేశవ్ రాజ్ సింగ్ ఇచ్చిన సమాచారం ఆధారంగా పోలీసులు ఈ గోవా లింకులను బట్టబయలు చేశారు.

**రూ. 48.4 లక్షల లావాదేవీలు గుర్తింపు..**

**ఏటీఎంల ద్వారా హవాలా**

నిందితుడు క్రిస్టీకి సంబంధించిన బ్యాంకు ఖాతాలను పరిశీలించిన దర్యాప్తు బృందాలు సుమారు రూ. 48.4 లక్షల వరకు అనుమానాస్పద లావాదేవీలు జరిగినట్లు గుర్తించాయి. ఈ ముఠా కార్యకలాపాల తీరు వినూత్నంగా సాగినట్లు విచారణలో తేలింది. హైదరాబాద్‌కు నేరుగా వచ్చి స్థానిక యువతకు డ్రగ్స్ అందించిన అనంతరం, ఇక్కడి నుంచి ఏటీఎం కేంద్రాల ద్వారా నగదును గోవాకు బదిలీ చేసేవారని పోలీసులు వెల్లడించారు. క్రిస్టీ మొబైల్ ఫోన్ డేటాను విశ్లేషించగా సంచలన విషయాలు వెలుగుచూశాయి. తెలంగాణ వ్యాప్తంగా ఆన్‌లైన్ ద్వారా డ్రగ్స్ కొనుగోలు చేసిన దాదాపు 25 మంది కీలక వ్యక్తులను పోలీసులు గుర్తించారు.

**నైజీరియన్ 'నిగి' పాత్రపై ముమ్మర దర్యాప్తు**

క్రిస్టీ మొబైల్ కాంటాక్ట్లు, కాల్ డేటా ఆధారంగా ఆ 25 మంది వినియోగదారులపై పోలీసులు సమగ్ర విచారణను ప్రారంభించారు. కాగా, ఈ డ్రగ్స్ సామ్రాజ్యం వెనుక గోవా కేంద్రంగా నెట్‌వర్క్ నడుపుతున్న నైజీరియన్ జాతీయుడు 'నిగి' (Nigi) పాత్రపై దర్యాప్తు బృందాలు ప్రధానంగా దృష్టి సారించాయి. రాష్ట్రంలో డ్రగ్స్ వినియోగాన్ని పూర్తిగా అణచివేసేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతున్న తరుణంలో, ఈ భారీ డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు కావడం సంచలనం సృష్టించింది. పరారీలో ఉన్న మిగతా నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.

# చౌటుప్పల్‌లో కిలోమీటరు మేర ట్రాఫిక్ జామ్

**మొదటిపేజీ తరువాయి**

ధర్మోజీగూడెం వరకు సుమారు కిలోమీటరు మేర వాహనాలు బారులు తీరాయి.

ఫ్లైఓవర్ నిర్మాణ పనుల కారణంగా హైవేపై రాకపోకలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. పండుగ సెలవులతో సొంతూళ్లకు వెళ్లే కార్లు, ఇతర వాహనాలు పెద్ద సంఖ్యలో రహదారిపైకి రావడంతో ట్రాఫిక్ నెమ్మదించింది. వాహనాలు ముందుకు కదలడానికి ఎక్కువ సమయం పడుతుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**యూటర్న్ కోసం రెండు కిలోమీటర్లు**

హైవేపై రోడ్డు దాటేందుకు, యూటర్న్ తీసుకునేందుకు సుమారు రెండు కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోందని వాహనదారులు చెబుతున్నారు. దీంతో స్థానికులు, పాదచారులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రహదారిని దాటాల్సిన అవసరం ఉన్నవారు సరైన మార్గం కోసం ఎక్కువ దూరం వెళ్లాల్సి వస్తోంది.

ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయ్యే వరకు ట్రాఫిక్ సమస్యలు కొనసాగుతాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. పండుగ రద్దీ నేపథ్యంలో వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడంతోపాటు పాదచారులు రోడ్డు దాటేందుకు సురక్షితమైన ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



# విమానంలోకి వచ్చి కిడ్నాప్ చేశారు

**మొదటిపేజీ తరువాయి**

ఆరోపించారు. తమను అదుపులోకి తీసుకునే సమయంలో ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని, ఫోన్లను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. న్యాయవాదిని సంప్రదించేందుకు కూడా అనుమతించలేదని చెప్పారు. ఆదివారం విడుదలైన అనంతరం దిల్లీలో సీజేపీ ప్రతినిధులు మీడియా సమావేశం నిర్వహించి పోలీసుల తీరుపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఒక వ్యక్తిని కాపాడేందుకే దేశంలో భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని సౌరవ్ దాస్ విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను రక్షించేందుకు ఎందుకు ప్రయత్నిస్తున్నారని ప్రశ్నించారు. తమ పోరాటాన్ని కొనసాగిస్తామని, వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు.

**ఎమర్జెన్సీ తరహా**

**పరిస్థితులు: అశుతోష్ రాంకా**

దిల్లీలో శనివారం ఎమర్జెన్సీ తరహా పరిస్థితులు కనిపించాయని సీజేపీ నేత అశుతోష్ రాంకా ఆరోపించారు. రైళ్లు, ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడం ద్వారా ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు. గతంలో ఎమర్జెన్సీ గురించి విన్నామని, ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నామని వ్యాఖ్యానించారు.

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా.. జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారని రాంకా ఆరోపించారు. ఒక వ్యక్తిని రక్షించేందుకు దేశ ప్రజలతోనే ప్రభుత్వం పోరాటం చేస్తున్నట్లుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అయితే ఈ వ్యాఖ్యలు సీజేపీ నేతలు చేసిన ఆరోపణలు మాత్రమే.

**నిరసనలపై 20 కేసులు**

మరోవైపు, శనివారం దిల్లీలో జరిగిన నిరసనలకు సంబంధించి 20 కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. భద్రతా సిబ్బందిపై దాడి చేయడం, ప్రభుత్వ ఉద్యోగులు విధులు నిర్వర్తించకుండా అడ్డుకోవడం వంటి ఆరోపణలపై కేసులు నమోదైనట్లు తెలిపారు. విద్యార్థులపై దాడి చేయడం, మహిళలను దుర్భాషలాడటం వంటి ఆరోపణలపై అదుపులోకి తీసుకున్న నలుగురిపై కూడా కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. శనివారం జరిగిన ఘటనల్లో 15 మందికి పైగా పోలీసు సిబ్బంది గాయపడినట్లు వెల్లడించారు.

సీజేపీ నేతలు పోలీసుల చర్యలను తప్పుబడుతుండగా, నిరసనల సందర్భంగా చట్టవిరుద్ధ కార్యకలాపాలు చోటుచేసుకున్నాయని పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ పరిణామాలతో దిల్లీలో ఎన్నికల సంఘం తీరుపై కొనసాగుతున్న నిరసనలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# 'సర్' పేరుతో మైనారిటీల ఓట్ల తొలగింపు


**మొదటిపేజీ తరువాయి**

చేపడుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. ప్రజలు తమ హక్కుల కోసం గొంతెత్తితే వారి నిరసనలను అణచివేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

ఢిల్లీలో నిరసనల నేపథ్యంలో ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారని, పెట్రోల్ బంకులు, రహదారులను మూసివేశారని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే అవకాశాలను పరిమితం చేయడం సరికాదని అన్నారు. నిరసనకారుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, వారి గొంతును నొక్కేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. తెలంగాణలోనూ ఇదే తరహా చర్యలకు పాల్పడే ప్రమాదం ఉందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఓటరు జాబితాల సవరణ పేరుతో మైనారిటీల ఓటు హక్కుకు నష్టం కలిగించే ప్రయత్నాలను అప్రమత్తంగా గమనించాలని సూచించారు. మైనారిటీలంతా ఐక్యంగా ఉండి తమ హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో కీలకమైనదని పేర్కొన్న కేటీఆర్.. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ పారదర్శకంగా జరగాలని, ఎవరి ఓటు హక్కూ అన్యాయంగా తొలగించకూడదని అన్నారు.

కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం ఈ అంశంపై స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ కోరారు. మైనారిటీల్లో ఆందోళన కలిగిస్తున్న అంశాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.



# డేటా లీక్‌లను అరికట్టాలి

**మొదటిపేజీ తరువాయి**

ఎదురయ్యే సవాళ్లపైనా దృష్టి పెట్టాలని అన్నారు. డిజిటల్ భద్రతను నిర్లక్ష్యం చేయకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. విద్యా రంగంలో సాంకేతికత కీలక మార్పులు తీసుకొస్తోందని మంత్రి తెలిపారు. సంప్రదాయ బోధనా పద్ధతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడిస్తే విద్యార్థులకు మరింత మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని అభిప్రాయపడ్డారు. విద్యార్థుల అభ్యాస ప్రక్రియను సులభతరం చేయడంలో ఏఐ ఆధారిత పరిష్కారాలు ఉపయోగపడతాయని చెప్పారు. విద్యార్థులు సాధన, అభ్యాసం కోసం ఎడ్యుకేషన్ టెక్నాలజీని వినియోగించుకోవడం సంతోషకరమని పేర్కొన్నారు.

విద్యార్థులకు ఉపయోగపడే సాంకేతిక పరిష్కారాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని శ్రీధర్‌బాబు అన్నారు. విద్యా సంస్థల్లో ఎదురయ్యే సమస్యలకు ఆధునిక సాంకేతికత ద్వారా పరిష్కారాలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. డిజిటల్ వ్యవస్థల భద్రతతోపాటు డేటా విశ్లేషణలోనూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ ఘటన తర్వాత డేటా లీక్‌లను అరికట్టాల్సిన అవసరం మరింత పెరిగిందని మంత్రి పేర్కొన్నారు. వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం కాకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని అన్నారు. డేటా సెంటర్ల నిర్వహణ నుంచి ఏఐ సాధనాల వినియోగం వరకు ప్రతి దశలోనూ గోప్యత, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుందని వివరించారు.

ఇంపాక్ట్2025 సర్వే ప్రకారం, ఎడ్యుకేషన్ టెక్నాలజీని ఉపయోగిస్తున్న పిల్లల్లో 77 శాతం మంది ప్రాక్టీస్, లెర్నింగ్ కోసం వాటిని వినియోగిస్తున్నారని శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ గణాంకాలు విద్యా రంగంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ప్రాధాన్యాన్ని తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా సురక్షితమైన, సమర్థవంతమైన సాంకేతిక పరిష్కారాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సాంకేతికతను కేవలం వినియోగించుకోవడమే కాకుండా, దాని వల్ల ఎదురయ్యే ప్రమాదాలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. డేటా భద్రత, గోప్యత, బాధ్యతాయుత ఏఐ వినియోగం సమాంతరంగా కొనసాగినప్పుడే సాంకేతికత ద్వారా సమాజానికి మెరుగైన ప్రయోజనాలు అందుతాయని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

# శివాజీని మతానికి పరిమితం చేయొద్దు

- **పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి వెల్లడి**
- **సంగారెడ్డి బైపాస్ రోడ్డులో విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ**
- **చరిత్రను రాజకీయాలకు వాడుకుంటున్నారని బీజేపీపై విమర్శ**
- **శివాజీ సైన్యంలో ముస్లిం అధికారులు కూడా ఉన్నారని వెల్లడి**
- **కులమతాల కంటే ప్రజల సంక్షేమమే ముఖ్యమని వ్యాఖ్య**
- **రాజ్య భద్రతకు శివాజీ ప్రాధాన్యమిచ్చారని స్పష్టం**
- **శివాజీ చరిత్రను యువత తెలుసుకోవాలని పిలుపు**
- **సంగారెడ్డిలో విగ్రహ ఏర్పాటుకు శ్రీకారం**
- **చరిత్రను వక్రీకరించవద్దని హితవు**
- **రాజకీయ లబ్ధి కోసం శివాజీ పేరును వాడుకుంటున్నారని ఆరోపణ**

**హైదరాబాద్, (డీడీ9 వార్త):**

ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను ఒక మతానికి మాత్రమే పరిమితం చేయడం సరికాదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి అన్నారు. చరిత్రను వక్రీకరించి రాజకీయ లబ్ధి కోసం బీజేపీ శివాజీ పేరును ఉపయోగించుకుంటోందని విమర్శించారు. ఆదివారం సంగారెడ్డి బైపాస్ రోడ్డులో ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు ఆయన భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడారు. ఛత్రపతి శివాజీ పాలనలో ముస్లిం అధికారులు కూడా పనిచేశారని జగ్గారెడ్డి గుర్తుచేశారు. శివాజీని కేవలం ఒక కులానికి లేదా మతానికి చెందిన వ్యక్తిగా చూడకూడదని అన్నారు. రాజ్యంలోని ప్రజల సంక్షేమం, రాజ్య భద్రతకు ఆయన ప్రాధాన్యమిచ్చారని పేర్కొన్నారు. పాలనలో ప్రజల బాగోగులను దృష్టిలో ఉంచుకున్నారని తెలిపారు.

ఛత్రపతి శివాజీ గొప్ప వీరుడని, ఆయన జీవితం, చరిత్ర గురించి యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉందని జగ్గారెడ్డి సూచించారు. చరిత్రను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం సరికాదని అన్నారు. చారిత్రక వ్యక్తుల సేవలు, పాలనా విధానాలను సమగ్రంగా అర్థం చేసుకోవాలని పేర్కొన్నారు. సంగారెడ్డి బైపాస్ రోడ్డులో శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ నిర్వహించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. శివాజీ చరిత్రను మతపరమైన కోణంలో మాత్రమే కాకుండా, ఆయన పాలన, సైనిక వ్యూహాలు, ప్రజల పట్ల బాధ్యత వంటి అంశాల ఆధారంగా కూడా అధ్యయనం చేయాలని యువతకు సూచించారు.

# గోవాను డ్రగ్స్ అడ్డాగా మార్చేశారు

- **బీజేపీ పాలనలో గోవా ప్రజలకు తీవ్ర అన్యాయం**
- **కార్పొరేట్ల చేతుల్లోకి భూములు వెళ్లకుండా కాపాడుకోవాలి**
- **ఉపాధి లేక నిరాశలో గోవా యువత**
- **డ్రగ్స్‌కు అడ్డాగా గోవా మారింది**
- **ప్రధాన నగరాలకు గోవా నుంచే మాదకద్రవ్యాల సరఫరా**
- **గోవా అస్తిత్వాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత: రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, (డీడీ9 వార్త):**

గోవా రాష్ట్ర ప్రజల పట్ల భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తీవ్ర వివక్ష చూపుతోందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గోవా అస్తిత్వాన్ని, అక్కడి భూములను కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన స్పష్టం చేశారు. బీజేపీ పాలనలో గోవా యువత తీవ్ర నిరాశ, నిస్పృహల్లో (ఫ్రస్టేషన్) కొట్టుమిట్టాడుతోందని, సరైన ఉపాధి లేక ప్రమాదకరమైన మత్తు పదార్థాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటోందని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం గోవా పూర్తిగా మాదకద్రవ్యాలకు ప్రధాన కేంద్రంగా (డ్రగ్స్ అడ్డాగా) మారిపోయిందని ఆరోపించిన రేవంత్ రెడ్డి.. దేశంలోని ప్రధాన నగరాలకు అక్కడి నుంచే డ్రగ్స్ సరఫరా అవుతున్నాయని పేర్కొన్నారు.

ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో పట్టుబడుతున్న డ్రగ్స్ మూలాలు గోవాలోనే ఉన్నాయని, అక్కడి నుంచే ఇక్కడికి అక్రమంగా రవాణా అవుతున్నాయని సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో తాను అధికారంలోకి రాకముందు హైదరాబాద్‌లో డ్రగ్స్ విచ్చలవిడిగా లభించేవని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మత్తు పదార్థాల మహమ్మారిపై పూర్తిస్థాయిలో ఉక్కుపాదం మోపామని వివరించారు. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్, పోలీసు నిఘా ద్వారా నెట్‌వర్క్‌లను ఛేదిస్తూ కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గోవా భవిష్యత్తును కాపాడటానికి యువతను చైతన్యవంతం చేయాలని, బీజేపీ అస్తవ్యస్త పాలనకు చరమగీతం పాడాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# కౌకూర్‌లో ఆరేళ్ల బాలుడి హత్య.. రూ.20 లక్షల కోసం కిడ్నాప్!

- **ఆడుకుంటూ కనిపించకుండా పోయిన మోజెస్ అరులియా**
- **క్లబ్‌హౌస్ సంపులో చిన్నారి మృతదేహం**
- **కాళ్లు, చేతులు కట్టేసిన స్థితిలో బాలుడు**
- **కుటుంబానికి ఫోన్ చేసి రూ.20 లక్షలు డిమాండ్**
- **వాచ్‌మెన్ విక్రమ్‌పై అనుమానాలు**
- **పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసుల గాలింపు**
- **కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**
- **సికింద్రాబాద్‌లో కలకలం రేపిన ఘటన**
- **కిడ్నాప్, హత్య వెనుక కారణాలపై దర్యాప్తు**

**హైదరాబాద్, (డీడీ9 వార్త):**

సికింద్రాబాద్‌లోని కౌకూర్‌లో ఆరేళ్ల బాలుడు మోజెస్ అరులియా హత్యకు గురైన ఘటన కలకలం రేపింది. ఆడుకుంటూ కనిపించకుండా పోయిన చిన్నారి.. సమీపంలోని క్లబ్‌హౌస్‌లో ఉన్న సంపులో విగతజీవిగా కనిపించాడు. కిడ్నాప్ చేసి రూ.20 లక్షలు డిమాండ్ చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపిన నేపథ్యంలో ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

**ఆడుకుంటూ వెళ్లి అదృశ్యం**

మోజెస్ అరులియా ఆడుకుంటూ ఉండగా కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. ఈలోగా చిన్నారిని అపహరించిన వ్యక్తి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు సమాచారం. దీంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

**సంపులో మృతదేహం**

కుటుంబ సభ్యులు చిన్నారి కోసం వెతుకుతున్న సమయంలో సమీపంలోని క్లబ్‌హౌస్ సంపులో బాలుడి మృతదేహం కనిపించింది. కాళ్లు, చేతులు కట్టేసిన స్థితిలో మృతదేహం లభించడం ఘటన తీవ్రతను తెలియజేస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

**వాచ్‌మెన్ కోసం గాలింపు**

ఈ ఘటనలో వాచ్‌మెన్ విక్రమ్‌పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చిన్నారిని హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అతడు పరారీలో ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. అతడి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. అయితే, నిందితుడి పాత్ర, హత్యకు గల కారణాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

కిడ్నాప్ చేసి డబ్బులు డిమాండ్ చేయడం, అనంతరం చిన్నారి మృతదేహం లభించడం వెనుక ఉన్న పూర్తి వివరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసి సాక్ష్యాధారాలను సేకరిస్తున్నారు. చిన్నారి అదృశ్యం నుంచి మృతదేహం లభించే వరకు జరిగిన పరిణామాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

## కామారెడ్డి జిల్లా పద్మశాలి సంఘం నూతన కార్యవర్గంలో బీర్కూర్ మండలానికి నాలుగు పదవులు

**బీర్కూర్, (డీడీ9 వార్త ):**

కామారెడ్డి జిల్లా పద్మశాలి సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో బీర్కూర్ మండలానికి చెందిన నలుగురికి కీలక పదవులు దక్కడంతో మండల పద్మ శాలి సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చే స్తున్నారు. జిల్లా పద్మశాలి సంఘం నూతన కార్యవర్గంలో బీర్కూర్ మండలానికి చెందిన వారికి లభించిన పదవులు దీకొండ రమేష్ - జిల్లా ఉపాధ్యక్షులు మాదస్వార్ సాయినాథ్ - కార్యదర్శి రచ్చ ఆంజనేయు లు - సహాయ కార్యదర్శి వంగరి శ్రీనివాస్ - ప్రచార కార్యదర్శి జిల్లా స్థాయి కార్యవ ర్గంలో బీర్కూర్ మండలానికి ప్రాతినిధ్యం లభించడం పట్ల పద్మశాలి సంఘం సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. నూతనంగా బా ధ్యతలు చేపట్టిన నాయకులు పద్మశాలి సంఘం అభివృద్ధికి, కులస్తుల ఐక్యతకు, సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణకు కృషి చేయాలని ఆకాంక్షించారు. బీర్కూర్ మండలానికి చెందిన నలుగురికి జిల్లా కార్యవర్గంలో అవకాశం కల్పించిన జిల్లా నాయకత్వానికి మండల పద్మశాలి సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. నూతన బా ధ్యతలు చేపట్టిన నాయకులకు శుభాకాంక్ష లు తెలియజేశారు.

## సర్వే నంబర్ 80 భూమిపై రాజకీయ రాద్ధాంతం తగదు

- **వైరల్ వీడియోల ప్రచారాన్ని ఖండించిన రహత్ నగర్ గ్రామస్తులు**

**నిజామాబాద్, (డీడీ9 వార్త ):**

భీమ్‌గల్ మండలం రహత్ నగర్ గ్రామంలో ని సర్వే నంబర్ 80 భూమి విషయంలో వాస్త వాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ చేస్తూ వివాదాలు సృ ష్టించడం సరికాదని గ్రామస్తులు స్పష్టం చేశారు. ఈ అంశాన్ని రాజకీయాలకు ము డిపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం వివిధ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు మీడియా సమావేశం నిర్వహించారు. గ్రామస్తుల కథనం ప్రకారం.. గతంలో సుంకరి కుటుం బానికి 10 ఎకరాల 26 గుంటల భూమిని ఇనాంగా కేటాయించారు. ఆ కుటుంబం కనుమరుగైన అనంతరం భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. భూమిపై ఆక్రమణ ప్రయత్నాలు జరిగిన సమయంలో గ్రామస్తులంతా కలిసి ప్రభుత్వానికి అప్ప గించినట్లు వివరించారు. ఇటీవల భూమిలో ఏర్పాటు చేసిన మోటారును తొలగించే క్రమంలో రెవెన్యూ అధికారులు, పోలీసులు వ్యవహరించిన తీరును వక్రీకరిస్తూ ప్రచారం చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎస్ఐ తిరుపతి, మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా పోలీసులు వ్యవహరిస్తున్నారంటూ జరుగుతున్న ప్రచా రాన్ని ఖండించారు. పోలీసులు విధి నిర్వహ ణలో భాగంగా చేపట్టిన చర్యలను రాజకీయ వివాదంగా చిత్రీకరించడం తగదన్నారు. వాస్తవాలు నిర్ధారించుకోకుండా వీడియోలు షేర్ చేసి అపోహలు సృష్టించవద్దని, తప్పుడు ప్రచారం కొనసాగితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామ ప్రయోజనాలకు ప్రా ధాన్యమివ్వాలని కోరారు. ఈ సమావేశంలో సర్పంచ్ లకావత్ తిరుపతి, ఉపసర్పంచ్ భూక్య సేవలు, మాజీ జడ్పీటీసీ బాదావత్ శర్మ నాయక్, మాజీ సర్పంచ్ రాజ్ నాయక్, మాజీ ఎంపీటీసీ వినుకొండ ధర్మపురి, గ్రామ పెద్దలు, పలువురు గ్రామస్తులు పాల్గొ న్నారు.



## కొప్పులలో బతుకమ్మ విగ్రహావిష్కరణ.. పాల్గొన్న ఎమ్మెల్యే జీఎస్సార్

- **తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక**

**శాయంపేట, డీడీ9 వార్త**

తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాల పరిరక్షణలో బతుకమ్మ పండుగకు విశిష్ట స్థానం ఉందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం శాయంపేట మండలం కొప్పుల గ్రామంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ విగ్ర హాన్ని ఆయన ఆవిష్కరించారు.ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌ రవానికి,ఐక్యతకు, ప్రకృతితో ముడిపడిన జీవన విధానానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.సద్దుల బతుకమ్మ,దసరా పండుగలను ప్రజలు భక్తిశ్రద్ధలతో, ఆనం దోత్సాహాల మధ్య జరుపుకుంటారని తెలిపారు. గ్రామాల్లో బతుకమ్మ విగ్రహాల ను ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహించడం ద్వారా మన సంస్కృతి,సంప్రదాయాలను భావితరాలకు అందించవచ్చన్నారు.ప్రతి ఒక్కరూ పండుగల విశిష్టతను గుర్తించి ఐకమత్యంతో వేడుకలు జరుపుకోవాలని, గ్రామాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియా లని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో శాయంపేట మాజీ వైస్ ఎంపీపీ వంగాల నారాయణరెడ్డి, కొప్పుల సర్పంచ్ మామిడి అశోక్, ఉపసర్పంచ్ అలవాల భాస్కర్,కాం గ్రెస్ గ్రామ కార్యదర్శి ఏరుకొండ శంకర్, పెండ్యాల కుమారస్వామి, స్థానిక ప్రజాప్ర తినిధులు, కాంగ్రెస్ మండల నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.




## రోడ్డు ప్రమాదంలో అన్న మృతి.. తమ్ముడి పరిస్థితి విషమం

**నిజామాబాద్, (డీడీ9 వార్త ):**

కమ్మర్ పల్లి మండలం అమీర్ నగర్ గ్రామ పరిధిలోని బిల్యా నాయక్ తండా, కేసీఆర్ తండాల మధ్య ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో అన్న మృతి చెందగా, తమ్ముడు తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. ఒకే కుటుంబంలో అన్న మృతి చెందడం, తమ్ముడు విషమ పరిస్థితి లో ఉండటంతో గ్రామంలో విషాదం అలు ముకుంది.

గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్ నగర్ గ్రామానికి చెందిన వర్ణం రాజేందర్ ఇటీవల కువైట్ నుంచి స్వగ్రామా నికి వచ్చాడు. ఆదివారం తన అన్న వర్ణం నరసయ్య (30)తో కలిసి బైక్‌పై మెట్‌పల్లి సమీపంలోని ఓ గ్రామానికి వస్తువులు అం దించేందుకు వెళ్లారు. తిరిగి వస్తుండగా బిల్యా నాయక్ తండా, కేసీఆర్ తండాల మధ్య రోడ్డుపై మొక్కజొన్న ఆరబోసి ఉండగా, వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో నరసయ్య, రాజేందర్ తీవ్రంగా గాయపడగా, 108 అంబులెన్స్‌లో నిజామా బాద్‌కు తరలించారు. అప్పటికే నరసయ్య మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు గ్రామస్థులు తెలిపారు. రాజేందర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. మృతుడు నరసయ్యకు భార్య లతతో పాటు





తొమ్మిదేళ్ల కుమార్తె, ఏడేళ్ల కుమారుడు ఉన్నారు. కుటుంబానికి ఆధారమైన నరస య్య మృతి చెందడం, తమ్ముడు ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉండటంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ ఘటనతో అమీర్ నగర్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# తులం బంగారం హామీ ఏమైంది? ఇచ్చిన మాట నిలబెట్టుకోవాల్సిందే

- **కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసిన ఎమ్మెల్యే ధన్‌పాల్**

**నిజామాబాద్, (డీడీ9 వార్త ):**

ఎన్నికల సమయంలో ఆడబిడ్డలకు ఇచ్చిన తులం బంగారం హామీని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించరాదని నిజామాబాద్ అర్బన్ ఎమ్మె ల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వాటి అమలుపై జవాబుదారీగా వ్య వహరించాలని, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల భవిష్యత్తుపై ప్రజల్లో నెలకొన్న సం దేహాలకు తక్షణమే సమాధానం చెప్పాలని కోరారు. నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటో రియంలో ఆదివారం నిర్వహించిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, పథకాలు నిలిపివేస్తారంటూ ప్రచారం జరుగు తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఎందుకు స్పష్టత ఇవ్వడం లేదని ప్రశ్నించారు. అర్హులైన పేద కుటుంబాలు ఆందోళన చెందకుండా అధికా రులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు వాస్తవ పరి స్థితిని వెల్లడించాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు మూడేళ్లు కావస్తున్న నేపథ్యం లో తులం బంగారం హామీపై ఇకనైనా స్పష్ట మైన నిర్ణయం ప్రకటించాలని, కనీసం హామీ ఇచ్చిన సమయంలో ఉన్న బంగారం ధర ప్ర కారమైనా లబ్ధిదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలు కాగితా లకే పరిమితం కాకుండా ఆచరణలో అమలు కావాలని పేర్కొన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు దరఖాస్తు చేసుకున్న అర్హులకు చెక్కుల పంపిణీలో జాప్యం జరగ కుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో 275 మంది లబ్ధిదారులకు రూ.2.75 కోట్ల




విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ప్రభు త్వ సలహాదారు షబ్బీర్ అలీ, నూడా చైర్మన్ కేశ వేణు, బీజేపీ కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీ నారాయణ, మఠం పవన్, జగదీష్ కులకర్ణి, న్యాలం సునీత రాజు, బంటు ప్రీతి ప్రవీణ్, ఇప్పకాయల సుమిత్ర కిషోర్, నాయకులు పంచరెడ్డి శ్యామ్, పవన్ ముందడ తదితరు లు పాల్గొన్నారు.







## సోనాల కాంగ్రెస్ పార్టీ మైనారిటీ అధ్యక్షులు షేక్ ఇబ్రహీం కి ఘన సన్మానం.

**ఆదిలాబాద్ జిల్లా సోనాల మండలం (డీడీ9 వార్త):**

సోనాల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సోనాల మండల మైనార్టీ అధ్యక్షులుగా షేక్ ఇబ్రహీం కి పార్టీ నియమించడంతో వారికి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానిం చారు. ఈ సందర్భంగా షేక్ ఇబ్రహీం మాట్లా డుతూ పార్టీ మైనారిటీ బాధ్యతలు ఇవ్వడం సంతోషమని , పార్టీ బలోపేతం కోసం పని చే స్తానన్నారు. పదవి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి కార్యదర్శిలు లోలపు పోశెట్టి, చౌహాన్ హరిసింగ్, సోనాల మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు చౌహాన్ వినోద్ సింగ్, బోథ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జుంగల భోజన్న, మాజీ సర్పంచ్ సోయం బాపూరావు ,మండల ప్రధాన కార్యదర్శి బాశెట్టి సుదర్శ న్, చౌహాన్ సురేందర్, ఆత్రం. గోవిందరావు పటేల్, తులసీరామ్, సోనే రావ్, పాండురంగ్, అంకుష్, తదితరులు పాల్గొన్నారు.



## నా సమందర్‌లో వైభవంగా దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు

**నిజామాబాద్, (డీడీ9 వార్త ):**

కమ్మర్ పల్లి మండలం కోనా సమందర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ముందుగా గ్రామంలోని ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ముదిరాజ్ సంఘ భవనం నుంచి దుర్గాదేవి విగ్రహాన్ని మహిళలు మంగళహారతులతో, భక్తుల జయజయధ్వా నాల మధ్య గ్రామంలోని వివిధ వీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లి దేవి మండపంలో ప్ర తిష్ఠించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం సభ్యులు మాట్లాడుతూ గత తొమ్మిదే ళ్లుగా సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రతి ష్ఠించి తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలంద రూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థిస్తూ నైవేద్యాలు సమర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. నవరాత్రి ఉత్స వాల్లో గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పా ల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు ఇప్పపల్లి శ్రీకాంత్, గట్టు హనుమాన్లు, గమ్మత్ రజనీకర్, మందుల మహేష్, గమ్మత్ ప్రశాంత్, గమ్మత్ విజయ్, చింతల రాజేందర్, జన అజయ్‌తో పాటు ముదిరాజ్ యువజన సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.





## పేదలకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తా: ఎమ్మెల్యే ధన్‌పాల్

**నిజామాబాద్, (డీడీ9 వార్త ):**

అర్హులైన పేదలు ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా సూచించారు. తెలంగాణ సిక్కు సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్య శిబిరంలో పాల్గొన్న ఆయన, పేదలకు ప్రభుత్వ పథకాలు అందేలా తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలని, సిక్కు సమాజంలోని నిరుపేదలకు ఇళ్లు అందించేందుకు కృషి చే స్తానని హామీ ఇచ్చారు. పేదలకు వైద్య సేవలు అందించే ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. సమాజంలో ఐకమత్యంతో ఉంటూ సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని సూచించారు. భవి ష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాలకు తన సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. కార్య క్రమంలో తెలంగాణ సిక్కు సొసైటీ అధ్యక్షురాలు తేజ్‌దీప్ కౌర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ దర్శన్ సింగ్ సోకి, బీజేపీ కార్పొరేటర్ మఠం పవన్, పవన్ ముందడ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.




## ఆడబిడ్డల పెళ్లిళ్లకు అండగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్

**నిజామాబాద్, (డీడీ9 వార్త ):**

నిజామాబాద్ నగరంలోని రాజీవ్ గాంధీ ఆడి టోరియంలో ఆదివారం నిర్వహించిన కార్యక్ర మంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద అర్హులైన 275 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.2,75,31,900 విలువైన చెక్కు లను తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహ మ్మద్ అలీ షబ్బీర్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మె ల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అందజేశారు. ఇందులో షాదీ ముబారక్ పథకం కింద 149 మంది లబ్ధిదారులకు రూ.1,49,17,284, కళ్యాణలక్ష్మి పథకం కింద 126 మంది లబ్ధి దారులకు రూ.1,26,14,616 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీల అమలుతోపాటు పేద కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఆడబిడ్డల వివాహాలు తల్లిదండ్రుల కు ఆర్థిక భారంగా మారకూడదనే లక్ష్యంతో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా అర్హులైన కుటుంబాలకు ఆర్థిక సహాయం అం దిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకాలతో పేద కుటుంబాలకు కొంత ఆర్థిక వెసులుబాటు లభిస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవా లని సూచించారు. చెక్కులు అందుకున్న లబ్ధి దారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నుడా చైర్మన్ కేశ వేణు, స్థానిక కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతి నిధులు, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.







# పాత పోతంగల్ గ్రామంలో వైభవంగా ప్రారంభమైన 9వ శరన్నవరాత్రి ఉత్సవాలు

- **భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు**

**నిజామాబాద్ జిల్లా అక్టోబర్ 11:(డిడి9 వార్త):**

పోతంగల్ మండల కేంద్రంలో పాత పోతంగల్ గ్రామంలో శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక ఉత్సాహంతో కొనసాగుతున్నాయి. ఈ ఏడాది గ్రామంలో 9వ సంవత్సరం దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సార్వజనిక్ దుర్గామాత విగ్రహాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. ఆలయ ప్రాంగణం మొత్తం భక్తుల కోలాహలంతో, వేద మంత్రోచ్ఛారణలతో పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.

**ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు – హోమాలు**

తొమ్మిదో ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రోజూ ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో శాస్త్రోక్తంగా హోమాలు, జపాలు, మరియు మంగళహారతులు జరుగుతున్నాయి. అమ్మవారిని దర్శించుకోవడానికి స్థానిక భక్తులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుండి కూడా పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివస్తున్నారు.తొమ్మిది రోజుల పాటు నిరంతర అన్నదానం చేస్తారు.ఈ దేవీ నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ సభ్యులు మానవ సేవయే మాధవ సేవగా భావించి గొప్ప ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలు జరిగే తొమ్మిది రోజుల పాటు గ్రామానికి వచ్చే భక్తుల కోసం, స్థానికుల కోసం రెండు పూటలా నిరంతర అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

**చిన్నారులను ఆకట్టుకుంటున్న ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు**

కేవలం ఆధ్యాత్మిక పూజలకే పరిమితం కాకుండా, ఈ ఉత్సవాల్లో సరికొత్త రంగులు అద్దేలా సాంస్కృతిక కార్యక్రమాలను కూడా జోడించారు. ముఖ్యంగా చిన్న పిల్లల కోసం ప్రత్యేకంగా ఆటపాటల పోటీలను మరియు వినోద కార్యక్రమాలను ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. ఆధ్యాత్మిక వాతావరణంలో చిన్నారుల ఆటపాటలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఈ ఉత్సవాలకు మరింత శోభను తెచ్చిపెట్టాయి. ప్రస్తుతం పాత పోతంగల్ గ్రామంలో భక్తిభావం ఉరకలేస్తోంది. పూజలు, సాంస్కృతిక వేడుకలు, అన్నదానాలతో గ్రామం మొత్తం ఒక జాతరను తలపిస్తోంది. గ్రామ ప్రజలు, భక్తులు ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొంటూ అమ్మవారి కృపా కటాక్షాల కోసం వేడుకుంటున్నారు.







# నైపుణ్యంతో కొలువుల బాట!

- **సింగరేణి శిక్షణ కేంద్రం నుంచి 112 మందికి ఉద్యోగాలు**
- **ఫాక్స్‌కాన్‌లో 87 మంది మహిళలకు అవకాశం.. తొలి విడతగా 55 మంది హైదరాబాద్‌కు పయనం**

**పెద్దపల్లి బ్యూరో, అక్టోబరు 11 (డీడీ9 వార్త):**

సింగరేణి ఆర్జీ-1 ఏరియాలోని జీవీటీసీ నైపుణ్యాభివృద్ధి కేంద్రం ద్వారా 112 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. ఫాక్స్‌కాన్ కంపెనీలో పనిచేసేందుకు 87 మంది మహిళలు ఎంపిక కాగా, సోలార్ టెక్నీషియన్లు గా 25 మంది పురుషులు ఎంపికయ్యారు. ఫాక్స్‌కాన్‌కు ఎంపికైన మహిళల్లో తొలి విడతగా 55 మంది ఆదివారం హైదరాబాద్‌కు బయలుదేరారు.

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రారంభించిన ఈ కేంద్రం గత రెండేళ్లలో 500 మందికి పైగా ఉపాధి అవకాశాలు కల్పించింది. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందిస్తూ స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పిస్తోంది.

ఎంపికైన సోలార్ టెక్నీషియన్లు పది రోజుల్లో ఎల్ అండ్ ఎన్ కంపెనీలో విధుల్లో చేరనున్నట్లు ఆర్జీ-1 జీఎం డి. లలిత్‌కుమార్ తెలిపారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం



చేసుకొని క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు.

కార్యక్రమంలో ఎస్‌వో టు జీఎం ఎస్.కె. చంద్ర శేఖర్, ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, టాస్క్ మేనేజర్ డాక్టర్ కౌసల్య, ఫాక్స్‌కాన్ హెచ్‌ఆర్ ప్రతినిధి ఆర్. శ్రీనివాస్, జీవీటీసీ మేనేజర్ మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో వేళ.. సోలార్ వెలుగులు!


- **విద్యుత్ గ్రిడ్‌పై తగ్గుతున్న భారం..**
- **బోనకల్ మండలంలో రోజుకు 6.5 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి**
- **విద్యుత్ వినియోగదారులే.. విద్యుత్ ఉత్పత్తిదారులు!**
- **ఎస్ఈ ఈనుగుర్తి శ్రీనివాసాచారి....**


**బోనకల్,అక్టోబర్ 11,(డీడీ9 వార్త):**

ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ డిమాండ్ రోజు రోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో బోనకల్ మండలంలో సౌర విద్యుత్ ఉత్పత్తి కీలకంగా మారుతోందని ఎస్ ఈ ఈనుగుర్తి శ్రీనివాసాచారి అన్నారు.ఇప్పటికే 3250 ఇళ్లపై అమర్చిన సోలార్ ప్యానల్ నుంచి రోజుకు 6.5 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని,పెరుగుతున్న విద్యుత్ అవసరాల వేళ సౌర విద్యుత్ ఉత్పత్తి విద్యుత్ గ్రిడ్‌పై అదనపు భారాన్ని తగ్గించడంలో దోహదపడుతోంది. ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం కింద వినియోగదారులు సౌర విద్యుత్ ఉత్పత్తి దిశగా అడుగులు వేస్తుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇళ్లపై ఏర్పాటు చేస్తున్న సోలార్ ప్యానెళ్ల ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ వినియోగదారులే ఉత్పత్తిదారులుగా మారుతున్నారు. దీంతో సంప్రదాయ విద్యుత్ వనరులపై ఆధారపడటాన్ని తగ్గించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా అవకాశం ఏర్పడుతోంది.

**భవిష్యత్తుకు సోలార్ భరోసా**

విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో సౌర విద్యుత్ వినియోగాన్ని మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. బోనకల్ మండలంలో ఇప్పటికే నమోదవుతున్న 6.5 మెగావాట్ల రోజువారీ సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్రత్యామ్నాయ ఇంధన వనరుల ప్రాధాన్యతను చాటుతోంది. సోలార్ విద్యుత్ ఉత్పత్తి మరింత విస్తరిస్తే విద్యుత్ సరఫరా వ్యవస్థపై ఒత్తిడి తగ్గించడంతో పాటు దీర్ఘకాలంలో ఇంధన ఆదాకు కూడా దోహదపడుతుంది.









# జనగామ జోలికొస్తే ఖబడ్దార్ కాంగ్రెస్ సర్కార్ పై ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఫైర్

**జనగామ, అక్టోబర్ 11 (డిడి9) వార్త**

జనగామ జిల్లా దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జనగామలో నిర్వహించిన బహిరంగ సభలో ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. జనగామ జిల్లా ఏర్పాటు కోసం ప్రజలే పోరాడారని, అభివృద్ధి చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. కేసీఆర్ హయాంలోనే కలెక్టరేట్, మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, రోడ్ల విస్తరణ జరిగిందన్నారు. దేవాదుల ద్వారా గతంలో 50 వేల ఎకరాలకు మాత్రమే నీరు అందగా, కేసీఆర్ హయాంలో 3 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని, మరో 2 లక్షల ఎకరాలకు నిధులు కేటాయించామని తెలిపారు. ప్రస్తుతం విద్యుత్ లేక నీళ్లు ఎత్తిపోయలేక రైతులు ఇబ్బంది పడుతున్నారని మండిపడ్డారు. జిల్లా ఏర్పాటును గతంలో వ్యతిరేకించిన కడియం శ్రీహరి ఇప్పుడు జిల్లా గురించి మాట్లాడే హక్కు లేదని, జనగామ జిల్లాను రద్దు చేసే కుట్ర చేస్తే ప్రజలు సహించబోరని హెచ్చరించారు. స్టేషన్ ఘన్ పూర్ లో బీఆర్ఎస్ మద్దతుతో గెలిచిన సర్పంచులు, కౌన్సిలర్లను కడియం అయినా ఇతర నాయకులైనా బెదిరిస్తే చూస్తూ ఊరుకోబోమని, బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మూడు నెలల్లో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రైతులకు సాగునీరు, విద్యుత్ ఇవ్వాలని, పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, డాక్టర్ రాజయ్య, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# పోతంగల్ మండల కేంద్రంలో వైభవంగా 'ఫ్రెండ్స్ ఫ్యామిలీ డాబా' ప్రారంభోత్సవం

- **ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గంధపు దత్తుకు ఘన సన్మానం**

**నిజామాబాద్ జిల్లా (డిడి9 వార్త):**

పోతంగల్ మండల కేంద్రంలో సరికొత్త రుచులతో, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఏర్పాటు చేసిన నూతన 'ఫ్రెండ్స్ ఫ్యామిలీ డాబా' శనివారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. స్థానిక ప్రజలకు మరియు ప్రయాణికులకు నాణ్యమైన ఆహారాన్ని అందించడమే లక్ష్యంగా ఈ డాబాను నిర్వాహకులు అందుబాటులోకి తీసుకొచ్చారు.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని డాబా నిర్వాహకులు ఒక ప్రత్యేక సత్కార కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా, పోతంగల్ ఉమ్మడి మండలాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గంధపు దత్తు గారిని డాబా యాజమాన్యం శాలువాలు మరియు పూలమాలలతో ఘనంగా సన్మానించింది. సమాజంలో పాత్రికేయుల పాత్రను అభినందిస్తూ, ఆయనకు ఈ గౌరవాన్ని అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని పలువురు ప్రముఖులు, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై డాబాను సందర్శించారు. నూతనంగా ప్రారంభమైన ఈ హోటల్ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో మెరుగైన సేవలను అందించాలని, వ్యాపారపరంగా మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు నిర్వాహకులకు మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ ఘనమైన ప్రారంభోత్సవ వేడుకలో గంధపు రాజు, సుదం అరుణ్, పప్పుల అభిషేక్, మాజీ సైనికుడు సుధం శంకర్, గంట్ల శంకర్ లతో పాటు పోతంగల్ ఉమ్మడి మండలాల ప్రెస్ క్లబ్ సభ్యులు, స్థానిక వ్యాపారవేత్తలు, నిర్వాహకుల మిత్రులు మరియు బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





# ఘనంగా జనగామ జిల్లా దశాబ్ది ఉత్సవాలు..

- **విజయ ఫంక్షన్ హాల్‌లో జిల్లా ఉద్యమకారులకు ఘన సన్మానం..**

**జనగామ అక్టోబర్11(డిడి 9 వార్త)బ్యూరో**

జనగామ జిల్లా ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం జనగామ జిల్లా JAC ఆధ్వర్యంలో స్థానిక విజయ ఫంక్షన్ హాల్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. జనగామ జిల్లా JAC కన్వీనర్ మంగళంపల్లి రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 70 మంది జిల్లా ఉద్యమకారులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమానికి అతిథులుగా YTD సభ్యులు డాక్టర్ లక్ష్మీ నారాయణ నాయక్, డాక్టర్ రాజమౌళి, డాక్టర్ సుగుణాకర్ రాజు, కల్నల్ డాక్టర్ బిక్షపతి, డాక్టర్ రంజిత్, కన్న పరిశరములు, మెడ శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు పదేళ్ల జిల్లా సాధన ఉద్యమ జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. జనగామ జిల్లా సాధన ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులపై నమోదైన కేసులను ప్రభుత్వం ఎత్తివేయాలని JAC కన్వీనర్ మంగళంపల్లి రాజు కోరారు. ఉద్యమకారులకు జనగామ జిల్లా JAC ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. జిల్లా సాధన కోసం కృషి చేసిన ఉద్యమకారుల త్యాగాలు, పోరాటాలను గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ముఖ్య అతిథులు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో జనగామ జిల్లా అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. జిల్లా ఏర్పాటుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ, వివిధ సంఘాలు, సంస్థలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం జిల్లా సాధన ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను పూలదండలు, శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. జిల్లా ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ జనగామ జిల్లా అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని కార్యక్రమంలో పాల్గొన్నవారు ఆకాంక్షించారు.



# తెలంగాణ దశాబ్ది ఉత్సవాలకు సిద్దన్నపేట నుండి ఉత్సాహంగా తరలివెళ్లిన నాయకులు & గ్రామస్తులు

**నంగునూరు డిడి 9 వార్త**

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించే వేడుకలకు సిద్దన్నపేట గ్రామం నుండి బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు గులాబీ కండువాలు ధరించి పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా తరలివెళ్లారు.

ఈ సందర్భంగా గ్రామ నాయకులు మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ గారి నాయకత్వంలో మరియు మంత్రి హరీష్ రావు గారి మార్గదర్శకత్వంలో సిద్దిపేట జిల్లా అన్ని రంగాల్లో సాధించిన ప్రగతికి గుర్తుగా ఈ దశాబ్ది ఉత్సవాలను పండుగ వాతావరణంలో జరుపుకుంటున్నామని తెలిపారు. గత పదేళ్లలో జిల్లా తెచ్చుకున్న విప్లవాత్మక మార్పులు, సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాయని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, యువకులు మరియు పెద్దలు పాల్గొని వేడుకలకు బయలుదేరారు.



## ఘనంగా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

**అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం(. డీడీ9 వార్త)**

తలమడుగు మండలంలో వివిధ గ్రామాలలో. శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. భజ భజన్త్రీలతో. భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షలతో. అమ్మవారికి స్వాగతం పలికి. ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పురాణాల ప్రకారం. శరన్నవరాత్రి ఉత్సవాల ప్రత్యేకత ఏంటంటే

ఇది కేవలం ఒక పండుగ కాదు. చెడుపై మంచి గెలిచిన. తొమ్మిది రాత్రుల యుద్ధం. రాక్షసుడైన మహిషాసురుడిని చంపడానికి. అమ్మవారు తొమ్మిది రోజులు యుద్ధం చేసింది. అందుకే తొమ్మిది రోజులు 9 అవతారాలలో భక్తులు పూజిస్తారు.

ఈ తొమ్మిది రోజులు శక్తి భూమిపై ఎక్కువగా ఉంటుందని నమ్మకం. ఉపవాసం జాగరణ చేస్తే కోరిన కోరికలు తీరుతాయని భక్తుల నమ్మకం. 10వ రోజు విజయదశమి ఏ పని చేసినా. మొదలుపెట్టిన విజయం వరిస్తుందని. అంటారు.

అందుకే ఈరోజు నుండి తొమ్మిది రోజుల పాటు ప్రతిరోజు ఉపవాస దీక్షలతో భక్తి పరవశంతో. అమ్మవారిని పూజిస్తూ. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి. పాడి పశువు పిల్లలు పెద్దలు అందరూ ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో ఉండాలని భక్తులు కోరుకుంటారు

## సెంట్రలైజ్డ్ కిచెన్ల విధానం విరమించాలి

- **ఈనెల 28వ, తేదీన జరిగే, MLA క్యాంపు కార్యాలయాల ముట్టడి కార్యక్రమం జయప్రదం చేయండి,**
- **2023-2024 సంవత్సరానికి సంబంధించిన 9 నెలల అల్పాహారం పెండింగ్ బిల్లులు వెంటనే కార్మికుల ఖాతాలలో జమ చేయాలి,**

**ములుగు, డీడీ9 వార్త :**

తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ వాజేడు,, వెంకటాపురం,మండలాల సంయుక్త సమావేశం, మండలాల అధ్యక్షులు అల్లి అమ్రుత,, కుడుముల సమ్మక్క,అధ్యక్షతన జగన్నాధపురం జంక్షన్ వద్ద ఏర్పాటు చేయగా ముఖ్య అథిధి గా హాజరైన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ గారు మాట్లాడుతూ, గత 24 సంవత్సరాలుగా వంట పథకం లో స్వంత డబ్బులు పెట్టుకొని నాన్యమైన వంటలు చేస్తూ విధ్యార్థులను స్వంత పిల్లలుగా చూస్తూ భోజనాలు అందిస్తూ వంట బిల్లులు నెలల తరబడి పెండింగ్లో ఉన్నా వంటలు చేస్తున్న వంట కార్మికులకు ఇంత వరకు పరిపాలించిన ఒక్క ప్రభుత్వం కూడా వేతనాలు పెంచక పోయినా అన్యాయం చేయలేదు అన్నారు, కానీ ఎన్నికల ముందు వంట కార్మికులకు అనేక వాగ్దానాలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్నమాటలు అమలుచేయకుండా వంటల మీదనే ఆధార పడి జీవిస్తున్న రాష్ట్రంలో ఉన్న 54200 మంది వంట కార్మికలను రోడ్డున పడేసే విధంగా, అలాగే విధ్యార్థులకు కూడా నాణ్యమైన భోజనం అందచేయలేని భ్రాహ్మణ సంస్థ లైన హరేరామ హరేకృష్ణ వారికి కట్టబెట్టడానికి అల్పాహారం పేరుతోని(సెంట్రలైజ్డ్ కిచెన్), విధానానికి ముఖ్యమంత్రి గారు ఆత్రుతంగా పనిచేయడం విరమించుకోవాలని డిమాండ్ చేసారు, అందుకు మంత్రి సీతక్క గారు కూడా సహకారం అందించాలని కోరారు, గత ప్రభుత్వం లో వంట కార్మికుల ధ్వారానే నిర్వహించిన అల్పాహారం పథకానికి సంబందించిన 9 నెలల అల్పాహారం బిల్లులు నేటికీ విడుదల చేయకపోవడం వల్ల కార్మికులు అప్పుల ఊబిలోకి కూరుకుపోయారు. అన్నారు, కనుక పాత పెండింగ్ బిల్లులు అన్నీ వెంటనే విడుదల చేయాలని, బిల్లులు వేతనాలు ఏనెలవి ఆనెలలోనే విడుదల చేయాలని డిమాండ్ చేసారు, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హమీలైన రూ,, 10,000/ వేతనాలు, వంట కార్మికులను తొలగించకుండా జీఓ విడుదల,, వంట సరుకులు, గ్యాస్, కోడిగుడ్లు, మొత్తం ప్రభుత్వమే సరఫరా చేయడం, 12 నలలకు వేతనాలు విడుదల చేయడం, అతిముఖ్యమైన సెంట్రలైజ్డ్ కిచ్చెన్ విధానం విరమించుకొని అల్పాహారం కూడా వంట కార్మికులతోనే నిర్వహించాలని డిమాండ్ చేస్తునారు, ఈసమస్యల పరిష్కారానికి గాను ఈనెల 28 వ, తేదీన జరిగే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల ముట్టడి కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు, ఈ సంయుక్త సమావేశంలో పాల్గొన్న ఏఐటీయూసీ నాయకులు పోరెడ్డి ప్రమీల, టేకుల సంతోష్, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ నాయకులు ,వంట కార్మికులు ,పోడెం సమ్మక్క,నాగమణి,బొల్లె నర్సమ్మ, లక్ష్మికాంత, దేవమ్మ, లక్ష్మినర్సమ్మ, వెంకటలక్ష్మి, సత్యవతి, వెంకటమ్మ, పార్వతి, పెంటమ్మ,శంకరమ్మ,తదితరులు పాల్గొన్నారు.



# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

- **రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి**
- **తిరుమలాయపాలెం మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసిన మంత్రి**

**తిరుమలాయపాలెం, అక్టోబర్ 11, డి డి 9 వార్త :**

రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం మండలంలో మంత్రి పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. మంత్రి తెట్టెలపాడు గ్రామంలో తెట్టెలపాడు నుండి బీరోలు ఆర్ అండ్ బి రోడ్డు వరకు 6 కోట్ల 50 లక్షల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు శంఖుస్థాపన, సుబ్లేడ్ గ్రామంలో రూ. 10 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించారు. తిరుమలాయపాలెం మండలానికి చెందిన 26 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి/షాదీముబారక్ చెక్కుల పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇది ప్రజలు మనస్ఫూర్తిగా ఆశీర్వదించిన ఇందిరమ్మ ప్రభుత్వమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఈ ప్రభుత్వం పేదవాళ్ళకి మంచి చేయాలని, పేదవాళ్ళకి అండదండలుగా ఉండాలని, పేదవాడి కుటుంబం కూడా చిరునవ్వులతో ఎప్పుడూ జీవించాలని అనేక సంక్షేమ కార్యక్రమాలను ఈ 33 నెలల్లో మీ గుమ్మానికి చేర్చిందన్నారు.

200 యూనిట్ల ఉచిత కరెంటు, రైతు భరోసా, రైతు రుణమాఫీ, సన్నబియ్యం, సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు బోనస్‌గా క్వింటాలుకు 500 రూపాయలు, ఆడబిడ్డలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం వంటి అనేక పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. తెల్ల రేషన్ కార్డుతో పాటు, పెద్దోళ్ళు తినే సన్నబియ్యం బువ్వ నా పేదెంటి ఆడబిడ్డ తినాలని సన్న బియ్యం అందజేస్తున్నామన్నారు.

డ్వాక్రా మహిళలకి కోటి మందిని కోటీశ్వరులను చేయాలని, ఈ 33 నెలల్లోనే 72,000 కోట్ల రూపాయలు సున్నా వడ్డీకి ఇచ్చే కార్యక్రమం అమలు చేశామన్నారు. పెద్దోళ్ళ పిల్లలు చదివే స్కూళ్లకు దీటుగా ఇంటర్నేషనల్ స్థాయిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పేద పిల్లలు చదివే స్కూళ్లలో 40 శాతం డైట్ ఛార్జీలు, ఆడపిల్లలకు కాస్మోటిక్ ఛార్జీలు 200 శాతం పెంచామన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మొదటి విడతగా రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇళ్లు ఇచ్చామని, రెండో విడత రెండున్నర లక్షల ఇళ్లు ఇస్తూ, హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు, రమారమి అన్నీ కలిపి 8 లక్షల ఇళ్లు, 40 వేల కోట్ల రూపాయలు రెండు విడతల్లో నిరుపేద కుటుంబాలకి ఇల్లు కట్టించాలనే తాపత్రయంతో ఈ ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. రెండుసార్లు ఇళ్లు ఇచ్చాం, మా దగ్గర డబ్బులు అయిపోయినాయి, ఇక ఇవ్వము అనేది లేదని, మూడోసారి, నాలుగోసారి ఇస్తామని, అర్హులైన ప్రతి పేదవాళ్లకి నాలుగు విడతల్లో 5 లక్షల రూపాయలు ఉచితంగా ఇచ్చేది ఈ ఇందిరమ్మ ప్రభుత్వమే నని మంత్రి స్పష్టం చేశారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరుకు, ఏ పార్టీ అని, ఏ కులమని, ఏ మతమని అడగమని, చివరికి ఇల్లు ఇస్తే రేపు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తావా అని కూడా అడగమని అన్నారు.

ఒక్క ఇళ్ల కార్యక్రమే కాదు, పేదవాళ్ళ పక్షపాతంగా ఇంకా రాబోయే కొన్ని రోజుల్లో చెప్పిన ప్రతి మాటని పేదింటి ఆడబిడ్డకి ఈ ప్రభుత్వం నెరవేర్చుతుందని మంత్రి అన్నారు. ఆసరా పెన్షన్ కానీ, పేదింటి ఆడబిడ్డలకు ఇవ్వాల్సినవి





వందకు వంద శాతం అందిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ డబ్బుని పేదింటి ఆడబిడ్డలకి పంచుతామని మంత్రి అన్నారు.

ఎల్నినో ప్రభావం ఒక్క తెలంగాణ రాష్ట్రానికో, భారతదేశానికో కాదని, ప్రపంచవ్యాప్తంగా రాబోయే కొద్ది నెలలు కరెంటుతో పాటు నీటి తాగునీరు సమస్య కూడా రాబోతుందన్నారు. రైతన్నలు మొదటి పంట వేసుకున్నారని, ఎంత ఖరీదైనా కరెంటును కొని వేసిన పంటను నష్ట పోకుండా, ఎండిపోకుండా కాపాడే బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. రెండో పంట వేయడానికి నీళ్లు లేవని, 15 రూపాయలకు యూనిట్ చొప్పున కొందామన్న కరెంటు దొరకటం లేదని తెలిపారు. రైతన్నలు అర్థం చేసుకొని రాష్ట్రవ్యాప్తంగా రెండో పంటను వేయొద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఇప్పుడున్న పంటని ఏది ఏమైనా పండించే కార్యక్రమం చేస్తామని, రెండో పంట వేసి కరెంటు లేక, నీళ్లు లేక రైతన్నలు ఇబ్బంది పడొద్దని రైతులను కోరారు.


ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, డీఆర్డీవో శ్రీరామ్, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, ఎంపీడీవో సిలార్ సాహెబ్, సీతారాంరెడ్డి సర్పంచ్ లు నర్సమ్మ, స్వాతి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గ్రామ సహాయం నరేష్ రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్ మండల పార్టీ ఉపాధ్యక్షులు సామ శ్రీనివాస్ రెడ్డి మాజీ ఎంపీపీ బోడ మంగిలాల్ మద్దులపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ నంద్యాల శ్యాం సుందర్ రెడ్డి మాజీ జెడ్పిటిసి బెల్లం శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు శ్రీనివాస్ రెడ్డి మోర పాక నాగయ్య నంది పాటి మల్లికార్జున్ వనవాసం నరేందర్ రెడ్డి హోరా వెంకటేశ్వర్లు గండు చంద్రయ్య పూసులూరి సురేష్ వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు

## దక్షిణాఫ్రికా పర్యటన ముగించుకొని హైదరాబాద్ చేరుకున్న మంత్రి సీతక్కకీ ఘన స్వాగతం

- **శంషాబాద్ ఎయిర్ పోర్టులో రాష్ట్ర మంత్రి వర్యులు సీతక్కకి స్వాగతం పలికిన తాడ్వాయి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు**

**తాడ్వాయి డిడి9 వార్త**

దక్షిణాఫ్రికా పర్యటనను ముగించుకొని నేడు హైదరాబాద్ చేరుకున్న తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి వర్యులు ధనసరి అనసూయ సీతక్కకి జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ తో కలిసి తాడ్వాయి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు మంత్రి సీతక్క ప్రజాసేవను, రాష్ట్ర అభివృద్ధి కోసం ఆమె చేస్తున్న కృషిని కొనియాడుతూ, ఆమె పర్యటన విజయవంతంగా ముగించుకొని తిరిగి హైదరాబాద్ చేరుకోవడం సంతోషకరమని తాడ్వాయి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు
ఈకార్యక్రమంలో తాడ్వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంకిడి నరసింహ స్వామి , మాజీ మండల అధ్యక్షులు బొల్లు దేవేందర్ ముదిరాజ్ , ట్రస్ట్ బోర్డ్ మాజీ చైర్మన్ అరెం లచ్చు పటేల్ , జిల్లా ప్రధాన కార్యదర్శి జాలపు అనంత రెడ్డి,జిల్లా కార్యదర్శి ఇర్ప సునీల్ ,మాజీ ఎంపీటీసీ ,సీనియర్ నాయకులు బత్తిని రాజు గౌడ్ , సహకార సంఘం చైర్మన్ పులి సంపత్ గౌడ్ , ఉపాధ్యక్షులు ఇప్ప నాగేశ్వర్ రావు , సహకార సంఘం మాజీ చైర్మన్ పాక సాంబయ్య ,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కోడి సతీష్ కుమార్ , బీసీ సెల్ అధ్యక్షులు యాషాఢపు మల్లయ్య , మాజీ సర్పంచ్ బెజ్జూరు శ్రీనివాస్ , కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు భూషబోయిన రవి కుమార్ ,మేడారం గ్రామ కమిటీ అధ్యక్షుడు గాడిగ అనిల్ కుమార్ ,తాడ్వాయి గ్రామ కమిటీ అధ్యక్షుడు పాక రాజేందర్ ,మండల నాయకులు దాయ వెంకన్న , జంగా సంతోష్ రెడ్డి , అనుమాండ్ల రాజీ రెడ్డి , రాపోలు సంజీవ రెడ్డి యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంట సాయి రెడ్డి , బొప్ప వినోద్ కుమార్ , ప్రశాంత్ , తదితర నాయకులు పాల్గొన్నారు



## ఢిల్లీకి బయలుదేరిన తెలంగాణ కాంగ్రెస్ నేతలు

- **ఎఐసిసి పిలుపు మేరకు నిరసన కార్యక్రమాలు.**

**డిడి9వార్త / పెద్దపల్లి అక్టోబర్ 12:**

చీఫ్ ఎలక్షన్ కమిషన్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని నిరసన తెలపడానికి ఎఐసిసి పిలుపు మేరకు టీపీసీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ప్రజా ప్రతినిధులు మరియు కాంగ్రెస్ నాయకులతో కలిసి ఢిల్లీకి వెళ్తున్న రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు తదితరులు ఉన్నారు.





## ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

- **తొలిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన విగ్రహ దాత బాదావత్ నాగేశ్వరరావు దంపతులు**

**బోనకల్, (డీడీ9 వార్త):**



మండల కేంద్రంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో బంజారా హిల్స్ రోడ్ నెంబర్ 01 మాజీ జెడ్పిటిసి బానోతు కొండ కాంప్లెక్స్ రోడ్డులో శ్రీ దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి, వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

**విగ్రహ దాత బాదావత్ నాగమ్మ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు**

ఉత్సవాల మొదటిరోజు అమ్మవారి విగ్రహ దాత బాదావత్ నాగమ్మ, నాగేశ్వరరావు కళ్యాణి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పుష్పాలు సమర్పించి, కుటుంబంతో పాటు గ్రామ ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించారు. నవరాత్రి ఉత్సవాలు భక్తుల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందిస్తూ, బోనకల్ గ్రామ బంజారా హిల్స్ ప్రాంతంలో పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చాయి.

**ఉత్సవాల్లో పాల్గొన్న ఫ్రెండ్స్ యూత్ సభ్యులు**

ఫ్రెండ్స్ యూత్ కమిటీ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. నవరాత్రి రోజులలో అమ్మవారికి ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కమిటీ సభ్యులు కోరారు. భక్తి, ఐకమత్యం, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచే దుర్గామాత నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ఫ్రెండ్స్ యూత్ సభ్యులు కృషి చేస్తున్నారు.

## బాల త్రిపుర దేవి అలంకరణలో ఇబ్రహీంపూర్ దుర్గామాత

**జనగామ అక్టోబర్ 11(డిడి 9 వార్త)బ్యూరో**

రఘునాతపల్లి మండల పరిధిలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో తొలిసారిగా ప్రతిష్ఠించిన దుర్గామాత అమ్మవారు బాల త్రిపుర దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అర్చనలు నిర్వహించారు. బాల త్రిపుర సుందరి రూపంలో అమ్మవారిని దర్శించుకున్న భక్తులు భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అదేవిధంగా పూజారి శివ అయ్యగారు భక్తులకు మాలధారణ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోకల శ్రీనివాస్, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ కాసార్ల లక్ష్మమయ్య, మేడిపల్లి నరేష్, మాటూరి పోశెట్టి నూనె ఉప్పాలయ్య పండుగ ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.





## బ్రాహ్మణపల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్ అందుబాటులోకి
## సప్లై టెస్ట్ ఛార్జ్ పూర్తి.. క్లస్టర్ పరిధిలో మెరుగుపడనున్న విద్యుత్ సరఫరా


**బోనకల్,అక్టోబర్ 11, (డీడీ9 వార్త):**


మండల పరిధిలోని బ్రాహ్మణపల్లిలో 10 ఎంవీఏ సామర్థ్యంతో ఏర్పాటు చేసిన నూతన విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఆదివారం సప్లై టెస్ట్ ఛార్జ్ నిర్వహించారు. దీంతో సబ్‌స్టేషన్ క్లస్టర్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు ఆదివారం నుంచి సేవలు అందుబాటులోకి వచ్చాయి.

**విద్యుత్ సరఫరాకు మరింత భరోసా**

10 ఎంవీఏ సామర్థ్యం కలిగిన ఈ నూతన సబ్‌స్టేషన్ అందుబాటులోకి రావడంతో పరిధిలోని విద్యుత్ సరఫరా వ్యవస్థకు అదనపు సామర్థ్యం సమకూరింది. విద్యుత్ వినియోగం అధికంగా ఉండే సమయాల్లో సరఫరా వ్యవస్థ పై ఒత్తిడిని తగ్గించేందుకు, లోహోల్టేజీ సమస్యలను నియంత్రించేందుకు, విద్యుత్ అంతరాయాలను తగ్గించేందుకు ఇది దోహదపడనుంది.

గృహ, వ్యవసాయ, వాణిజ్య విద్యుత్ అవసరాలకు మెరుగైన సరఫరా అందించడంలో ఈ సబ్‌స్టేషన్ కీలకంగా నిలవనుంది. స్థానిక విద్యుత్ పంపిణీ వ్యవస్థ బలోపేతం కావడంతో వినియోగదారులకు మరింత నాణ్యమైన విద్యుత్ సేవలు అందించేందుకు అవకాశం ఏర్పడింది. భవిష్యత్తులో పెరిగే విద్యుత్ డిమాండ్‌ను తట్టుకునేందుకు కూడా ఈ సబ్‌స్టేషన్ ఉపయోగపడనుంది. బ్రాహ్మణపల్లి నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ అందుబాటులోకి రావడం మండల పరిధిలో విద్యుత్ సరఫరా మెరుగుదలకు కీలక ముందడుగుగా నిలుస్తోంది.









# డిడి 9 వార్త కథనానికి కదిలిన అధికార యంత్రాంగం

**చర్ల, అక్టోబర్ 11 (డిడి 9 వార్త )**

డిడి 9 వార్త పత్రికలో ఆదివారం ప్రచురితమైన "అధికారుల నిర్లక్ష్యానికి రోడ్డే సాక్ష్యం" అనే వార్తాకథనానికి అధికారులు స్పందించారు. ఎట్టకేలకు ఆదివారం సెలవు దినం అయిన కూడా పంచాయతీ సిబ్బంది జేసీబి సహాయంతో గుంతను పూడ్చారు. ఈ మేరకు తక్షణమే అధికారులు స్పందించిన తీరు పై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. పంచాయతీ సిబ్బందికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ విషయంలో ఇన్ని రోజులు జాప్యం చేయకుండా వెంటనే స్పందించి పైప్ లైన్ ను అమర్చి ఉంటే బాగుండేదని స్థానికులు హితవు పలికారు. ఏది ఏమైనప్పటికి గుంతను పూడ్చి తాత్కాలికంగా మట్టి రోడ్డును నిర్మించారు కానీ ఇల్లు అలకగానే పండుగ కాదని సీసీ రోడ్డు నిర్మించి ప్రజలకు అందించడం అధికారుల ముఖ్య విధి అని అన్నారు. మట్టి రోడ్డుతో సరిపెడదామనుకుంటే అది ప్రమాదకరమని ఎందుకంటే గుంతను పూడ్చే క్రమంలో మట్టిని పోయడం వలన ఆ పోసిన మట్టి రోడ్డుపై ట్రాక్టర్లు, వ్యాన్ ల లాంటి వాహనాలు సంచరించడం వలన ఆ మట్టి




క్రిందికి దిగిపోయి వాహనాలు ఇరుక్కుపోయే అవకాశాలు ఉన్నాయని తక్షణమే సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుకుంటున్నారు. అలాగే బప్టాండ్ ప్రాంగణంలోని హెచ్పీ పెట్రోల్ బంక్ ను ఆనుకొని ఉన్న టీజీ ఆర్టీసీ ప్రహరీ గోడకు హోటల్ భవనం ప్రహరీ గోడకు మధ్యలో ఉన్న రోడ్డు ఇరుకుగా మారడానికి గల కారణాలపై సైతం అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుకుంటున్నారు. సీసీ రోడ్డు నిర్మాణం పై అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.





## అధికారుల నిర్లక్ష్యానికి.. రోడ్డే సాక్ష్యం

- ఇసుక లారీలతో రహదారులన్నీ ఛిద్రం.. ఉన్న దారులను తప్పి అధికారులు చూస్తున్నారు చోద్యం
- రోడ్డు మధ్యలో భగీరథ పైప్ లైన్.. లీకైతే తప్పన్నిండే రోడ్డు వన్స్ ఎగైన్
- వృధా అవుతుంటే ప్రజాధనం.. చెప్పాలి అధికారులే ప్రజలకు సమాధానం
- ప్రజలకు రోడ్డు లేక కలుగుతుంటే అసౌకర్యం.. రోడ్డు నిర్మాణంలో ఎందుకింత జాప్యం
- అసలే ఇరుకు రోడ్డు.. ఆపై గుంత తప్పి పెట్టారు రాళ్లను అడ్డు
- భారీ వాహనాలతో రోడ్డన్నీ గుంతల మయం.. గుంత తప్పి పట్టించుకోకుండా అధికారుల మాయం

**చర్ల, అక్టోబర్ 10 (డిడి 9 వార్త )**

వివరాల్లోకి వెళ్తే చర్ల మండలంలో కొన్ని గ్రామాలకు రోడ్డు సదుపాయం లేక జనం నానా అవస్థలు పడుతుంటే ఉన్న రోడ్డును తప్పి రోజులు గడుస్తున్నా వాటిని పట్టించుకోకుండా జాప్యం చేస్తున్నారు మండల అధికారులు. గత నెల మిషన్ భగీరథ వాటర్ పైప్లైన్ లీకైన సమయంలో టీజీ ఆర్టీసీ హెచ్పీ పెట్రోల్ బంక్ కు అయ్యప్ప హోటల్ కు మధ్యలో ఉన్న ఈ రోడ్డు ప్రధాన రహదారికి కలిసే రోడ్డు దీనిని గ్రామ పంచాయతీ సిబ్బంది లీకైన పైప్ లైన్ ను వెలికి తీసేందుకు పెట్రోల్ బంక్ పైప్ ను వున్న రోడ్డు పైకి బర్స్ట్ అయ్యింది. ఈ క్రమంలో పూడ్చిన మట్టిని తిరిగి జెసిబి సహాయంతో తొలగించి లీకేజీ సమస్యనైతే అరికట్టగలిగారు కానీ గుంతను పూడ్చకుండా వదిలేశారని, ఇదేమని మళ్లీ పైప్ లీక్ అయితే ఎలాగ రోడ్డును తవ్వాల్సిందే అనుకున్నారో ఏమో పంచాయతీ శాఖ అధికారులు ఈ పని అడుగుల భారీ గుంతను అలాగే గాలికి వదిలేసారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లీకేజీని అరికట్టి రెండు వారాలు గడుస్తున్నా గుంతను పూడ్చాలన్న కనీస బాధ్యత కాని, రోడ్డు నిర్మించాలన్న ధ్యాస గాని అధికారులకు లేదని స్థానికులు ఆవేశం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు ఇంత అసౌకర్యానికి గురవుతున్నా అధికారులకు చీమకుట్టినట్టుగా కూడా లేదని, పట్టించుకునే నాధుడే లేడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ వందల మంది ప్రజలు, బస్సులు దుకు వచ్చే ప్రయాణికులు ఈ దారి గుండా వచ్చి తీరా దారి మూసివేయడంతో చేసేదేమీ లేక మెయిన్రోడ్డుపైకి వెళ్లి అక్కడి నుంచి ప్రయాణాలు సాగిస్తున్నారని, ఇది అధికారుల అసమర్థతకు అద్దం పడుతుందని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజా పాలన రాజ్యంలో అధికారులు ప్రజలకు సౌకర్యాలను కల్పించాల్సింది పోయి అసౌకర్యాన్ని కలిగించడం వారి నిర్లక్ష్య ధోరణికి నిదర్శనం అని విద్వేషా చేశారు. రోడ్డు నిర్మాణంలో ఎందుకింత జాప్యం అని అధికారులను అడగగా ఇసుక లేదని కుంటి సాకు చెబుతున్నారని రాజు తలుచుకుంటే కొరెడ్డెల్లకు కొదవేంటని చర్ల మండల పంచాయితీలలో ఎన్నో ఇసుక ర్యాంపులు ఉదుగా ఇసుక దొరకపోవడం హాస్యాస్పదం అని అన్నారు. ఇది ఇలా వుండగా బస్టాండ్ మెయిన్ గేటు సమీపంలో వున్న పాత కరెంట్ ఆఫీస్ అని పిలవబడే భవనాన్ని ప్రస్తుతం మన గ్రోమార్ కంపెనీ గోదాగా ఉపయోగిస్తున్నారని, ఈ గోడౌన్ కు మంద బస్సులను మేపుకొని వచ్చే లారీ దారుణ 25 నుండి 30 ఉన్నుల అధిక బరువును కలిగి ఉంటుందని ఈ అధిక బరువును తట్టుకోలేక రోడ్డు కృంగిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ తరుణంలో భారీ లోడు వాహనాలను ఈ రోడ్డుపై సంచరించకుండా నిషేధించాలని, అధిక బరువును తట్టుకునేంత సామర్థ్యం ఈ అంతర్గత రోడ్డుకు లేదని, కాదని వాహనాలకు అనుమతిస్తే తిరిగి ఇదే పరిస్థితి వస్తుందని స్థానికులు తేల్చి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనలే ఇరుకు రోడ్డు పాత కరెంట్ ఆఫీస్ నుండి నేరుగా నిర్మించిన రోడ్డు హోటల్ భవనం పక్కకు రాగానే ఒక్కసారిగా ఎదుమైపుకు వంపు తిరగడం ఎవిబనీ? కుదిమైపుకు ఎందుకు తిరగలేదని? ఫ్రశ్నిస్తున్నారు. బస్టాండ్ చుట్టూ ఆర్టీసీ సంస్థ నిర్మించిన ప్రహరీ గోడ కారణంగా రోడ్డు ఇరుకుగా మారిందా? లేక హోటల్ భవనం కారణంగా రోడ్డు ఇరుకుగా మారిందా? అనే విషయంపై ఉన్నతాధికారులు, సంబంధిత మండల శాఖ అధికారులు, గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు సమగ్ర విచారణ జరిపి ప్రజల అవసరాలు కాపాడాలని స్థానికులు కోరుకుంటున్నారు.

# పట్టభద్రుల ఓటరు నమోదులో నిర్లక్ష్యం వద్దు.. అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి..

- **ప్రతి గ్రామంలో పట్టభద్రులను గుర్తించాలి.. ఇంటింటికీ వెళ్లి నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి ..**
- **బీఆర్ఎస్ మండల నాయకుల పిలుపు..**

**అక్టోబర్11 డిడి9 వార్త వెంకటాపురం.**

ఖమ్మం-నల్గొండ-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం వెంకటాపురం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు గంప రాంబాబు, చిడం రవికుమార్ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు అవగాహన సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మండలంలోని ప్రతి గ్రామంలో అర్హులైన పట్టభద్రులను గుర్తించి, వారందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా పార్టీ నాయకులు, గ్రామ స్థాయి కోఆర్డినేటర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన లేక అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కును కోల్పోకుండా ప్రతి ఒక్కరికీ సమాచారం చేరవేయాలని పిలుపునిచ్చారు.

**నవంబర్ 6లోగా నమోదు పూర్తి చేసుకోవాలి!**

పట్టభద్రుల ఓటరు నమోదుకు అర్హత కలిగిన వారు ఫారం18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, డిగ్రీ సర్టిఫికెట్, ప్రొవిజనల్ సర్టిఫికెట్ లేదా సంబంధిత విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఇప్పటికే పట్టభద్రుల ఓటర్ల జాబితాలో పేరున్నవారు కూడా తాజా ఎన్నికల అధికారుల సూచనల మేరకు తమ నమోదు స్థితిని పరిశీలించుకోవాలని సూచించారు. నవంబర్ 6, 2026ను నమోదు గడువుగా పేర్కొంటూ, అర్హులైన పట్టభద్రులు చివరి తేదీ వరకు వేచి చూడకుండా



ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

**ప్రతి పట్టభద్రుడి ఓటు కీలకం..**

**నమోదు బాధ్యత అందరిదీ..**

పట్టభద్రుల ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో కీలకమైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటర్ల జాబితాలో చోటు సంపాదించేలా క్షేత్రస్థాయిలో కృషి చేయాలని నాయకులు పేర్కొన్నారు. గ్రామాల వారీగా పట్టభద్రులను గుర్తించడం, వారికి అవసరమైన సమాచారం అందించడం, దరఖాస్తు ప్రక్రియపై అవగాహన కల్పించడం ద్వారా నమోదు కార్యక్రమాన్ని సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.
ఈ సమావేశంలో పట్టభద్రులు, పట్టభద్రుల ఓటరు నమోదు కోఆర్డినేటర్లు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## క్రీడా సంబరానికి ఘనంగా శ్రీకారం.. వెంకటాపురం
# ప్రీమియర్ లీగ్ సీజన్–3 ప్రారంభం!

- **టోర్నీని ప్రారంభించిన సీఐ ముత్యం రమేష్.. యువత క్రీడల వైపు అడుగులు వేయాలని పిలుపు..**

**అక్టోబర్ 11, డిడి9 వార్త వెంకటాపురం.**

ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో క్రికెట్ సందడి నెలకొంది. క్రీడాభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతూ, యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో కాఫెడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న వెంకటాపురం ప్రీమియర్ లీగ్ (వీపీఎల్) సీజన్-3కు ఘనంగా శ్రీకారం చుట్టారు. వెంకటాపురం సీఐ ముత్యం రమేష్ ముఖ్య అతిథిగా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుని, టోర్నీ విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సీఐ ముత్యం రమేష్ మాట్లాడుతూ.. క్రీడలు వ్యక్తుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు, క్రమశిక్షణ, పట్టుదల, జట్టుగా పనిచేసే తత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, క్రీడలను జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. క్రీడాకారుల్లో పోటీతత్వాన్ని పెంపొందిస్తూ, ప్రతిభకు తగిన గుర్తింపు అందించేందుకు నిర్వాహకులు భారీ నగదు బహుమతులను ప్రకటించారు. టోర్నీలో విజేతలకు మొదటి బహుమతిగా రూ.55,555, ద్వితీయ బహుమతిగా రూ.33,333, తృతీయ బహుమతిగా రూ.22,222, నాలుగో బహుమతిగా రూ.11,111 అందజేయనున్నారు. దీంతో టోర్నీపై క్రీడాకారుల్లో మరింత ఆసక్తి నెలకొంది. ఈ ప్రారంభ కార్యక్రమంలో ఎస్సై కొప్పుల తిరుపతిరావు, వెంకటాపురం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ సరస్వతి, పీఏసీఎస్ చైర్మన్ చెడేం మోహన్ రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, మన్యం సునీల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప రాంబాబు, ముడుంబా శ్రీను తదితరులు పాల్గొన్నారు.






## రూ.6 లక్షలతో నిర్మించిన రంజాన్ షెడ్డును
# ప్రారంభించిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**మణుగూరు. అక్టోబర్ 11 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని కూరగాయల మార్కెట్ సమీపంలోని మసీదు వద్ద రూ.6 లక్షల వ్యయంతో నిర్మించిన రంజాన్ షెడ్డు ను పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, వారి సౌకర్యార్థం నిధులు కేటాయిస్తూ అభివృద్ధికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ముస్లిం సోదరులకు ఉపయోగకరంగా ఉండేలా రంజాన్ షెడ్డు నిర్మాణం చేపట్టడం సంతోషకరమని తెలిపారు.అన్ని మతాలు, అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, మణుగూరు మున్సిపాలిటీతో పాటు పినపాక నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో మైనారిటీ అధ్యక్షులు రహీం పాషా,మండలకాంగ్రెస్‌పార్టీఅధ్యక్షులు,పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు కురం రవి ముదిరాజ్, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, మైనారిటీ సోదరులు, మహిళా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## తెలంగాణ పట్టభద్రుల ఎన్నికలు:
# బుద్ధిజీవుల నిశ్శబ్ద వికసిత్ తెలంగాణ వేదిక

**తాడ్వాయి డిడి9 వార్త**

తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు అంటే కేవలం ఒక ఓటు కాదు. అది తెలంగాణ బుద్ధిజీవి ఆత్మగౌరవానికి పరీక్ష. ఉద్యమాలకు ఊపిరి పోసిన వర్గం, తెలంగాణ ఆలోచనను గుండె చప్పుడుగా చేసుకొని ప్రజల శ్రేయస్కర విధానాలకు బాటలు వేసిన మహోన్నత వర్గమే పట్టభద్రుల ప్రస్థానం.
ఎన్నో ప్రభుత్వాల అరాచకాలను, దోపిడీత నాన్ని నిగ్గదీసి అడిగే తత్వం గల సామాజిక జీవన విధానానికి బాటలు పరిచిన మేధావులు అందరూ ఒక్క తాటి పైకి రావలసిన అవసరం ఉన్నది.తెలంగాణ గ్రాడ్యుయేట్ల సమస్యలకు ఎప్పుడూ పరిష్కారం దొరకలేదు. ఉద్యోగాల్లో తీవ్ర అన్యాయం, యూనివర్సిటీలలో ఫ్యాకల్టీ కొరత, హాస్టల్ సౌకర్యాలు లేకపోవడం, స్కాలర్ షిప్ లు సకాలంలో రాకపోవడం ఇవన్నీ అప్పటి పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం. తెలంగాణ బిడ్డ పట్టా పొందినా ప్రతి ఒక్కరూ అన్యాయాలపై, గళం విప్పి గర్జిస్తూనే, ఓటు ద్వారా అభివృద్ధిని మెరుగుపరిచే కృషి చేద్దాం 2001 నుండి 2014 వరకు సాగిన మలిదశ తెలంగాణ పోరాటంలో గ్రాడ్యుయేట్లు క్రియాశీలక పాత్ర పోషించారు. ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీల నుండి వచ్చిన నినాదం "నీళ్లు, నిధులు, నియామకాలు" అనే మూడు అంశాల చుట్టూనే తిరిగింది. లాఠీ దెబ్బలు తిన్నది, జైలుకు వెళ్ళింది, అమరులైనది ఎక్కువగా ఈపట్టభద్రులే. తెలంగాణ వస్తే తమ బతుకులు మారుతాయని వారు కలలు కన్నారు. తెలంగాణ వచ్చిన పరిస్థితి యధా విధంగానే కొనసాగుతుంది. మన చెమట చుక్కలు, రక్తం చిందించి, బలిదానాల మధ్య తెలంగాణను సాధించిన. తెలంగాణ ఆకాంక్షాలు అలాగే మిగిలి ఉన్నాయి.
సరైన నాయకత్వం దిశగా ప్రయాణించవలసిన అవసరం ఉన్నది. అదే ఒక మార్గంగా లక్ష్యాన్ని చేరుకునే సాధనం అది బిజెపితోనే సాధ్యమవుతుంది.
గత 60 సంవత్సరాల పాలనలో చూసుకున్నట్లయితే భారతదేశ అనేక పార్టీలు పాలన చేసిన అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండేది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఎక్కడో 12వ స్థానంలో ఉన్న భారతదేశం ఇప్పుడు అతి పెద్ద మూడవ ఆర్థిక వ్యవస్థగా అవతరించ బోతున్న సందర్భంగా ఇది.
బిజెపి పాలన ప్రారంభమైన తర్వాత భారతదేశం ఎంతో శాంతియుతంగా జీవితాన్ని గడుపుతుంది. దానికి నిదర్శనం ఎక్కడ కూడా ఉగ్రముఖల దాడి జరగకుండా అత్యంత ఇంటిలిజెంట్ వ్యవస్థను ఏర్పాటు చేసి భారతదేశానికి కాపాడుతున్నది. ఈ పరిస్థితి బీజేపీ పాలన కంటే ముందు సంవత్సరంలో ఒక్కసారైనా ఉగ్రదాడి బాధితురాలుగా భారతదేశ నిలిచింది. ఇప్పుడున్న పరిస్థితి దానికి పూర్తి భిన్నంగా ఉంది. బిజెపి ముందు దేశం తర్వాతే కుటుంబం నినాదంతో పాటు ఆచరణాత్మక విధానాలను పాలకులు చిత్తశుద్ధితో పాటిస్తున్నారు. ఇప్పుడున్న ఆధునిక జీవన విధానానికి తగినట్టుగా సమాజాన్ని మార్పు చేసుకుంటూనే సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుతుంది. కాబట్టి ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలలో బిజెపి యొక్క అభ్యర్థిని గెలిపించే విధంగా యువ ఎమ్మెల్సీ ఓటర్లందరూ ప్రణాళికలు రూపొందించి పాల్గొనవలసిన అవసరం ఉన్నది. దేశ హితమే, మా సమ్మతం అంటూ విజయ తీరాలకు చేరుదాం.అత్యుత్తమమైన విద్యా విధానానికి నాంది పలికింది కూడా బిజెపి పాలనలో మన పాలనని. ఇది చరిత్రలో నిలిచిపోయే అత్యుత్తమ మైలురాయి.NEP 2020 నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ దీనినే తెలుగులో జాతీయ విద్యా విధానం 2020 జూలై 29న ఆమోదం తెలపడం ద్వారా కొత్త కొత్త విద్యా శకానికి నాంది పలకడం జరిగింది. దీని ద్వారా తమకు నచ్చిన సబ్జెక్టును అభ్యసించవచ్చు. ఉదాహరణకు ఇంగ్లీషు, మ్యాథ్స్, బయాలజీ, చదవాల్సిన లేదా మరే ఇతర సబ్జెక్టుల్లో చదువుకోవాలన్న మల్టిపుల్ విద్యను అభ్యసించే విధంగా సౌలభ్యాన్ని ఈ విద్యా విధానం తీసుకురావడం జరిగింది.ఇది దేశంలో శరవేగంగా అభివృద్ధిని అందుకోవడానికి అవకాశం ఉన్నటువంటి మార్గం కాబట్టి ఎమ్మెల్సీ లో తమ అమూల్యమైన ఓటును ఇటువంటి పనులు చేస్తున్నటువంటి అభ్యర్థులకు బిజెపి మద్దతు తెలిపిన ఎమ్మెల్సీను . ఓటు ద్వారా మద్దతు తెలిపి గెలిపించవలసిన అవసరం ఉన్నది దేశ భవిష్యత్తు దృష్ట్యా.

**డాక్టర్ మైపతి సంతోష్ కుమార్**



# అనారోగ్యంతో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి యూత్ కాంగ్రెస్ అండ

- **50 కేజీల బియ్యం, రూ.2 వేల ఆర్థిక సాయం అందించిన జిల్లా యూత్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఎడ్ల నరేష్**

**మంగపేట అక్టోబర్ 11డీడీ 9 వార్త**

మానవత్వమే లక్ష్యంగా, ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలవడమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో ములుగు జిల్లా మంగపేట మండలం తిమ్మంపేట గ్రామానికి చెందిన తోటమల్ల నరసింహారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో, ఆయన కుటుంబాన్ని యూత్ కాంగ్రెస్ నాయకులు పరామర్శించి అండగా నిలిచారు.
రాష్ట్ర యువజన నాయకుడు కుంజ సూర్య అన్న ఆదేశాల మేరకు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఈస్సార్ ఖాన్ సూచనలతో, ములుగు జిల్లా యూత్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఎడ్ల నరేష్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నరసింహారావు దశదిన కర్మల సందర్భంగా ఆయన భార్య సుజాతకు 50 కేజీల బియ్యం, రూ.2,000 ఆర్థిక సాయం అందజేశారు.
ఈ సందర్భంగా ఎడ్ల నరేష్ మాట్లాడుతూ, కుటుంబ పెద్దను కోల్పోవడం ఎంతో బాధాకరమని, ఇలాంటి కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడం, అవసరమైన సమయంలో సహాయం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో మల్లూరు దేవస్థానం సభ్యుడు బోడ బొర్రయ్య, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి ముగాల చంటి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు భాసరికాని హరికృష్ణ, జిల్లా యూత్ నాయకుడు జంగం భానుచందర్, ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు పుల్లూరి తిరుపతి, మండల యూత్ నాయకుడు ఎల్.పీ. కిరణ్, యూత్ గ్రామ అధ్యక్షుడు ముక్కెర రాజు, బొలిగొడ్డు సందీప్, రెడ్డి పవన్, అబ్బరబోయిన రవీందర్, చిటమట నాగరాజు, బోడ శివ, గోనే డాన్, రజినీకాంత్‌తో పాటు గ్రామ కాంగ్రెస్ నాయకులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# మానవత్వం చాటిన శ్రీరామకృష్ణ సేవా ట్రస్ట్

- **అనారోగ్యంతో మృతిచెందిన వ్యక్తి కుటుంబానికి రూ.3,000 ఆర్థిక సహాయం**

**మంగపేట అక్టోబర్ 11డీడీ 9 వార్త**

ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ, మానవత్వమే తమ ధ్యేయమని చాటుకుంటోంది శ్రీరామకృష్ణ సేవా ట్రస్ట్. మంగపేట మండలం తిమ్మంపేట గ్రామానికి చెందిన తోటమళ్ల నరసింహారావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో ఆయన కుటుంబంలో విషాదం నెలకొంది. ఈ నేపథ్యంలో ఆదివారం ఆయన దశదిన కర్మలు జరగనున్న సందర్భంగా, బాధిత కుటుంబానికి అండగా నిలవాలని శ్రీరామకృష్ణ సేవా ట్రస్ట్ చైర్మన్ నాగ రమేష్ నిర్ణయించారు.

ఈ మేరకు ట్రస్ట్ సభ్యులతో మాట్లాడిన నాగ రమేష్, నరసింహారావు కుటుంబానికి రూ.3,000 ఆర్థిక సహాయం అందించాలని సూచించారు. ఆయన సూచనల మేరకు ట్రస్ట్ సభ్యులు నేరుగా తిమ్మంపేట గ్రామంలోని బాధిత కుటుంబం ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి దుఃఖంలో తామూ భాగస్వాములమని తెలియజేస్తూ, మనోధైర్యాన్ని కోల్పోవద్దని భరోసా కల్పించారు. అనంతరం కుటుంబానికి రూ.3,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

**సేవా దృక్పథంపై గ్రామస్తుల ప్రశంసలు**

కష్టకాలంలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ శ్రీరామకృష్ణ సేవా ట్రస్ట్ చేపడుతున్న సేవా కార్యక్రమాలపై గ్రామస్తులు ప్రశంసలు కురిపించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. సమాజంలో మానవత్వం, సేవాభావం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని అభిప్రాయపడ్డారు.

కేవలం ఆర్థిక సహాయం అందించడమే కాకుండా, కష్టాల్లో ఉన్న కుటుంబాలకు మానసిక ధైర్యాన్ని కల్పించడం కూడా ముఖ్యమని ట్రస్ట్ సభ్యులు తెలిపారు. నిరుపేదలు, ఆపదలో ఉన్న కుటుంబాలకు తమ వంతు సహాయం అందించడమే ట్రస్ట్ ప్రధాన లక్ష్యమని, భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు.



# పేద ఆదివాసీ బిడ్డ చదువుకు KTR భరోసా!

- **విద్యార్థినికి రూ.50 వేల ఆర్థిక సాయం అందించిన లక్ష్మణ్ బాబు**
- **ఎక్స్ వేదికగా విద్యార్థిని ఆవేదన.. స్పందించిన KTR.. ఫోన్‌లో మాట్లాడి భరోసా**

**మంగపేట అక్టోబర్ 11డీడీ 9 వార్త**

పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదనే సంకల్పంతో ఉన్నత చదువులు చదవాలన్న ఆశయంతో ముందుకు సాగుతున్న ఓ గిరిజన విద్యార్థినికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) స్పందించి ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకు వచ్చారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం వీరాపూర్ గ్రామానికి చెందిన పెనుక విశ్వనాథం కుమార్తె పెనుక శృతికి అండగా నిలిచారు. కేటీఆర్ సూచనల మేరకు ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు విద్యార్థిని కుటుంబాన్ని కలిసి రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

**ఎక్స్ వేదికగా విద్యార్థిని విజ్ఞప్తి**

వీరాపూర్ గ్రామానికి చెందిన పెనుక శృతి కష్టపడి చదివి కొడంగల్ వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ కోర్సులో సీటు సాధించింది. అయితే, వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురవడంతో కళాశాల ఫీజులు చెల్లించడం భారంగా మారింది. ఉన్నత చదువులు చదవాలన్న బలమైన కోరిక ఉన్నప్పటికీ, పేదరికం కారణంగా చదువు కొనసాగించలేని పరిస్థితి ఎదురవడంతో శృతి తన ఆవేదనను ఎక్స్ (X) వేదికగా వ్యక్తం చేస్తూ సహాయం కోరింది.

ఈ విజ్ఞప్తిపై స్పందించిన కేటీఆర్ విద్యార్థిని చదువుకు అండగా నిలవాలని నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

**శృతి కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం**

కేటీఆర్ ఆదేశాల మేరకు ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు స్వయంగా శృతి కుటుంబాన్ని కలుసుకుని వారి పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువు మధ్యలో ఆగిపోకూడదనే ఉద్దేశంతో ఈ సాయం అందించినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా లక్ష్మణ్ బాబు శృతితో మాట్లాడటమే కాకుండా, కేటీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడే అవకాశాన్ని కల్పించారు. దీంతో విద్యార్థినికి, ఆమె కుటుంబ సభ్యులకు ధైర్యం కలిగింది.

**'ధైర్యంగా చదువుకో అమ్మా.. నీ లక్ష్యాన్ని సాధించు'**

ఫోన్‌లో శృతితో మాట్లాడిన కేటీఆర్ ఆమెకు ధైర్యం చెబుతూ చదువుపై దృష్టి పెట్టాలని ప్రోత్సహించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పేదరికాన్ని చూసి భయపడకుండా ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని, బాగా చదువుకుని భవిష్యత్తులో తనలాగే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే పేద విద్యార్థులకు



సహాయం చేసే స్థాయికి ఎదగాలని సూచించినట్లు పేర్కొన్నారు.

తమ కుమార్తె ఉన్నత చదువులకు అండగా నిలిచినందుకు శృతి తల్లిదండ్రులు కేటీఆర్‌కు, లక్ష్మణ్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

**పేద విద్యార్థులకు అండగా నిలవడమే లక్ష్యం**

ఈ సందర్భంగా కాకులమర్రి లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ, పేదరికం కారణంగా ఏ విద్యార్థి కూడా చదువుకు దూరం కాకూడదనే భావనతో తన వంతు సహాయం అందించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి జీవితంలో స్థిరపడాలని, భవిష్యత్తులో మరికొందరికి సహాయం చేసే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ములుగు జిల్లాలో పేద విద్యార్థులకు అవసరమైన సహాయం అందించేందుకు తన వంతు కృషి కొనసాగిస్తానని ఆయన తెలిపినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

**రాజకీయాలకు అతీతంగా మానవీయ స్పందన**

ఒక విద్యార్థిని తన చదువును కొనసాగించేందుకు సహాయం కోరగా, ఆ విజ్ఞప్తికి స్పందించి ఆర్థిక సహాయం అందించడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఉన్నత చదువులు చదవాలనే ఆశయంతో ముందుకు సాగుతున్న శృతికి అందిన ఈ సహాయం ఆమె విద్యాభ్యాసానికి తోడ్పడుతుందని కుటుంబ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు.

విద్యార్థిని శృతి బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవడంతో పాటు, భవిష్యత్తులో తనలాంటి పేద విద్యార్థులకు అండగా నిలవాలన్న ఆకాంక్షను పలువురు వ్యక్తం చేశారు.

**పలువురు నాయకుల హాజరు**

ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం సర్పంచ్ కాకులమర్రి శ్రీలత, తాడ్వాయి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు దండుగుల మల్లయ్య, కాకులమర్రి ప్రదీప్ రావు, తుమ్మ మల్లారెడ్డి, కూనూరు అశోక్ గౌడ్, తాడూరి రఘు, ఎండీ ఖాజా పాషా, కర్ర రవీందర్, పులుసం పురుషోత్తం, దన్నపునేని కిరణ్ తదితరులు పాల్గొన్నారు.







# సింగరేణి పరిరక్షణే లక్ష్యం.. కార్మిక గర్జనకు సన్నద్ధం!

- **కాంగ్రెస్ పాలనపై కొప్పుల ఈశ్వర్, బాల్క సుమన్ విమర్శలు**
- **ఈ నెల 14న సింగరేణి స్టేడియంలో భారీ బహిరంగ సభ**

**పెద్దపల్లి బ్యూరో, అక్టోబరు 11 (డీడీ9 వార్త):**

రామగుండం నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ సన్నాహక సమావేశం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అధ్యక్షతన నిర్వహించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ నాయకుడు బాల్క సుమన్ ముఖ్య అతిథులుగా పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం 'సింగరేణి కార్మిక గర్జన' వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.... కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో సింగరేణి కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చామని, సంస్థ ప్రయోజనాలకు భంగం కలిగించే చర్యలను అడ్డుకుంటామని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సమన్వయంతో సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.


బాల్క సుమన్ మాట్లాడుతూ... సింగరేణి కార్మికుల బోనస్, డిపెండెంట్ ఉద్యోగాలు, జీవో 3 వంటి సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్మికులు, రైతులు, యువత సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.



మిరియాల రాజు రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 14న సాయంత్రం 5 గంటలకు రామగుండం సింగరేణి స్టేడియంలో కేటీఆర్ నాయకత్వంలో 'సింగరేణి కార్మిక గర్జన' బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సభను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు, అనుబంధ సంఘాలు, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నాయకులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, కొంకటి లక్ష్మీనారాయణ, కౌశిక హరి, వ్యాల్ల హరీశ్‌రెడ్డి, పీటీ స్వామి, మేకల సమ్మయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి సివిల్ రైల్వే సైడింగ్ శ్రీశ్రీశ్రీ భవానీ మాత ఆలయంలో విజయదశమి నవరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభం.

**మణుగూరు. అక్టోబర్ 11(డి డి 9వార్త)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు సింగరేణి సివిల్ రైల్వే సైడింగ్ శ్రీశ్రీశ్రీ భవానీ మాత ఆలయం నందు, విజయదశమి నవరాత్రి వేడుకలను సివిల్ DGM శివ ప్రసాద్ గారి సారధ్యంలో, సింగరేణి సివిల్ బృందం ఆధ్వర్యంలో తొలిరోజు ఘనంగా నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా సివిల్ DGM శివ ప్రసాద్ గారు మాట్లాడుతూ, సింగరేణి సివిల్ రైల్వే సైడింగ్ కాంట్రాక్ట్ కార్మికులను అభినందించారు. రైల్వే ట్రాక్ నిర్వహణను సక్రమంగా నిర్వహిస్తూనే, భక్తిపరమైన కార్యక్రమాల్లో కూడా క్రమశిక్షణతో వ్యవహరిస్తున్నారని కొనియాడారు. అలాగే ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికులు, సివిల్ బృందం ఆధ్వర్యంలో సివిల్ DGM గారికి శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు.గత కొన్ని సంవత్సరాలుగా నెలవారీ వేతనాలు అందే విషయంలో చాలా ఇబ్బందులు ఉండేవి. మీ రాకతో మణుగూరు ఏరియా కాంట్రాక్ట్ కార్మికుల జీతాలు సకాలంలో వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయి. ఈ విషయంలో మీకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము" అని కాంట్రాక్ట్ కార్మికులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సివిల్ బృందం నుండి జె. నవీన్ కుమార్, వి. రవి వర్మ, భరత్, అజయ్, మోహన్ రావు గారు, రైల్వే కాంట్రాక్ట్ కార్మికులు కే. గురుమూర్తి, జి. నాగేశ్వరరావు, వి. శంకర్, వై. శంకర్, యు. శివరామకృష్ణ, గోపి, ఎం. సాంబశివ రావు తదితరులు పాల్గొన్నారు.



# పూర్వ విద్యార్థుల సన్నాహక సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

- **రాష్ట్ర ప్రభుత్వం పూర్వ విద్యార్థుల దినోత్సవం నిర్వహించాలి.**
- **భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో తీర్మానం**

**భద్రాచలం టౌన్, అక్టోబర్ 11 (డీడీ 9 వార్త)**

రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలల నుంచి ఇంటర్, డిగ్రీ, యూనివర్సిటీ స్థాయి వరకు పూర్వ విద్యార్థుల సమ్మేళనాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1931 94 బీఏ బ్యాచ్ పూర్వ విద్యార్థులు తీర్మానించారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా తాము చదువుకున్న విద్యాసంస్థల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు భాగస్వాములయ్యే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఆదివారం భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1981 94 బీఏ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. పూర్వ విద్యార్థులు ఒకచోట చేరి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా పూర్వ విద్యార్థుల దినోత్సవాన్ని నిర్వహించి, పెద్ద సంఖ్యలో పూర్వ విద్యార్థులను భాగస్వాములను చేయాలని సమావేశంలో సూచించారు. కళాశాల అభివృద్ధిపై చర్చించేందుకు త్వరలోనే పూర్వ విద్యార్థులందరినీ కలుపుకొని విస్తృత స్థాయి సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో పెరిక సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ వైస్ చైర్మన్ బుడగం శ్రీనివాసరావు, ఆంధ్ర జ్యోతి ఖమ్మం బ్యూరో ఇన్ చార్జి నలజాల వెంకటరావు, కుంచాల రమేష్, రామ్ లాల్, ఎం. పద్మ తదితర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.




# భద్రాద్రి రామాలయంలో నేటి నుంచి శరన్నవరాత్రి వేడుకలు


- **సర్వం సిద్ధం చేసిన భద్రాద్రి దేవస్థానం.**
- **నేడు ఆదిలక్ష్మి రూపంలో అమ్మవారి దర్శనం**
- **రేపటి నుంచి శ్రీరామాయణ మహాపారాయణం, రామాయణ హరణం నిర్వహణ**
- **విజయదశమి రోజున శమీపూజ నిర్వహణ**

**భద్రాచలం టౌన్, అక్టోబర్ 11 (డీడీ 9 వార్త)**

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో నేటి నుంచి శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అందుకోసం దేవస్థానం అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసారు. ప్రస్తుతం రామాలయ నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో రామాలయ ఆవరణలో వేద ఆశీర్వచన మండపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిన్నమన్నారు. ఈ ఉత్సవాలను ఈసారి కూడా సోమవారం నుంచి ఈ నెల 21వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి రోజుకో ప్రత్యేక అలంకారం, నిత్య అభిషేకాలు, కుంకుమార్చనలు, సాయంత్రం దర్బారు సేవ నిర్వహించనున్నారు. ప్రతి రోజు అమ్మవారికి ప్రతిరోజూ ఉదయం అభిషేకం నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించనున్నారు. అనంతరం కుంకుమార్చన నిర్వహిస్తారు. సాయంత్రం దర్బారు సేవలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. అలాగే మారుతి సదనంలో నేటి నుంచి శ్రీరామాయణ మహాపారాయణోత్సవాలు ప్రారంభం కానుండగా, రేపటి నుంచి రామాయణ హరనం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా బాలకాండ, అయోధ్యకాండ, ఆరణ్యకాండ, కిష్కిందకాండ, సుందరకాండ, యుద్ధకాండలను పారాయణం చేయనున్నారు. సంక్షేప రామాయణ హవన పూర్ణాహుతితో పాటు విజయదశమి వేడుకల్లో భాగంగా పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

**తొలి రోజున ఆదిలక్ష్మి అలంకారంలో అమ్మవారి దర్శనం**

శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించనున్నారు. నేడు అమ్మవారు ఆదిలక్ష్మి అలంకారంలో వక్తులకు దర్శనమివ్వనున్నారు. అలాగే 13న సంతానలక్ష్మి, 14న గజలక్ష్మి, 15న ధనలక్ష్మి, 19న దాస్యలక్ష్మి,



17న విజయలక్ష్మి, 18న ఐశ్వర్యలక్ష్మి, 19న వీరలక్ష్మి, 20వ మహాలక్ష్మి అలంకారాల్లో అమ్మవారు దర్శనమివ్వనున్నారు. 21వ తేదీ విజయదశమి రోజున నిజరూపలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

విజయదశమి రోజే తిరువీధి సేవ

భద్రాచలం రామాలయంలో విస్తరణ, అభివృద్ధి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో పనులకు ఆటంకం కలగకుండా ఈసారి విజయదశమి రోజు నూత్రమే సీతారామచంద్రస్వామివారి తిరువీధి సేవ నిర్వహించనున్నారు. ఏటా మాదిరిగానే రాజగోపురం నుంచి స్వామివారిని మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ దసరా మండపానికి తీసుకురానున్నారు. విజయదశమి సందర్భంగా శ్రీ సీతారామచంద్రస్వామివారి నిత్యకల్యాణమూర్తులకు కళ్యాణం నిర్వహించిన అనంతరం మహాపట్టాభిషేకం జరపనున్నారు. సాయంత్రం విజయయాత్ర, కమిపూరు ఆయుధపూజ శ్రీరామలీలా మహోత్సవాలను నిర్వహించి, ఆనంతరం స్వామివారిని తిరిగి అలయానికి తీసుకురానున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాలు, విజయదశమి వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉంది.

# నవంబర్ 14 నుంచి 30వ నెహ్రూ కప్ క్రికెట్ పోటీలు

**భద్రాచలం టౌన్, అక్టోబర్ 11 (డీడీ9 వార్త)**

భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే నెహ్రూ కప్ అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలు ఈ ఏడాది నవంబర్ 14 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు టోర్నమెంట్ వ్యవస్థాపకులు తోటమల్ల బాలయోగి, వాతడి దుర్గా ఆశోక్ తెలిపారు. ఆదివారం భద్రాచలంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఈ ఏడాది టోర్నమెంట్ షెడ్యూల్ ను వెల్లడించారు. 1994లో ప్రారంభమైన నెహ్రూ కప్ క్రికెట్ పోటీలు ఈ ఏడాదితో 30వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్నాయని, టోర్నమెంట్ లో విజేత జట్టుకు రూ.60 వేల నగదు బహుమతి, రన్నరప్ జట్టుకు రూ.40 వేల నగదుతో పాటు ట్రోఫీలు, వ్యక్తిగత ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. పోటీల్లో పాల్గొనాలనుకునే జట్లు అక్టోబర్ 31వ తేదీలోగా తమ ఎంట్రీలను నెహ్రూ కప్ కన్వీనర్ ఎస్ కే సలీంకు అందజేయాలని సూచించారు. ఎంట్రీల కోసం 9440101108 నంబర్ ను సంప్రదించాలని తెలిపారు. టోర్నమెంట్ గౌరవ చైర్మన్ గా పాకాల దుర్గాప్రసాద్, గౌరవ అధ్యక్షుడిగా ఎస్ కే అజీమ్, గౌరవ సలహాదారులుగా ఉడతా రమేష్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా అట్లూరి శ్రీధర్, కన్వీనర్ గా ఎస్ కే సలీం, కార్యదర్శిగా ఎం. నాగార్జున, కోశాధికారిగా కుంచాల సదానందం (సిద్ధు) వ్యవహరించనున్నారు. ఉపాధ్యక్షులుగా గుమ్ములూరి శ్రీనివాసరావు, బాలమురళీకృష్ణ, సహాయ కార్యదర్శులుగా పూనెం ప్రదీప్ కుమార్, ఆనంద్ పాల్, కుప్పాల తేజ బాధ్యతలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# శివలింగాపురం గ్రామ అభివృద్ధికి మరో ముందడుగు..

- **రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, సైడ్ డ్రైన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.**

**మణుగూరు. అక్టోబర్ 11(డి డి 9వార్త)**

భద్రాద్రి జిల్లా, మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం వద్ద రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు, సైడ్ డ్రైన్‌ను పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. స్థానిక ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడంతో పాటు, మురుగు నీరు సక్రమంగా పారేలా సైడ్ డ్రైన్ నిర్మాణం చేపట్టడం ద్వారా పరిసరాల పరిశుభ్రతకు, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు దోహదపడనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, పినపాక నియోజకవర్గం లోని అన్ని గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. నాణ్యమైన సీసీ రోడ్ల నిర్మాణం ద్వారా ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు, రహదారులపై ప్రయాణించే వారికి మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. శివలింగాపురం గ్రామం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం పరిసరాల్లో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడం వల్ల వైద్య సేవల కోసం వచ్చే ప్రజలకు, అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులకు, వారి తల్లిదండ్రులకు రాకపోకల పరంగా ఎంతో సౌకర్యం కలుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యంగా వర్షా కాలంలో రహదారులపై నీరు నిలవడం, బురద కారణంగా ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులను తగ్గించేందుకు రహదారి నిర్మాణంతో పాటు సైడ్ డ్రైన్ ఏర్పాటు చేయడం ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.రోడ్డు నిర్మాణంతో పాటు సైడ్ డ్రైన్ ఏర్పాటు చేయడం వల్ల మురుగునీరు సక్రమంగా ప్రవహించేందుకు అవకాశం కలుగుతుందని, పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండే సమస్యను తగ్గించవచ్చని పేర్కొన్నారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం, ఆరోగ్యకరమైన పరిసరాలను అభివృద్ధి చేయడం కూడా మౌలిక సదుపాయాల కల్పనలో ముఖ్యమైన భాగమని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపడుతూ, స్థానిక సమస్యలకు శాశ్వత పరిష్కారం



చూపేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పినపాక నియోజకవర్గంలో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలు, తాగునీటి సౌకర్యాలు, పారిశుద్ధ్యం తదితర మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి ఫలాలు ప్రతి గ్రామానికి, ప్రతి వార్డుకు చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా నియోజకవర్గంలో అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతున్నామని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. శివలింగాపురం అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తామని, ప్రజల సహకారంతో పినపాక నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు కురం రవి ముదిరాజ్, జిల్లా ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మైనారిటీ నాయకులు, మహిళా నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# నర్సాపూరం కట్టువాగుకు మోక్షమెప్పుడు..?!

- సాగునీటి కోసం రైతుల భగీరథ పోరాటం!
- గుడ్డ సంచుల్లో ఇసుక నింపి తాత్కాలిక అడ్డుకట్ట..
- వృథా నీటిని పొలాలకు మళ్లించిన రైతులు!
- ఐదు గ్రామాల్లో వందలాది ఎకరాలకు సాగునీటి ఆధారం..
- అయినా అధికారుల నిర్లక్ష్యానికి పరిష్కారం కరువు..!







**ఏటూరునాగారం క్రైం, డీడీ 9 వార్త, అక్టోబర్ 11:**

సాగునీరు అందించాల్సిన వాగు కళ్లముందే ప్రవహిస్తోంది..ఆ నీటిని ఒడిసిపట్టి పంట పొలాలకు మళ్లించేందుకు రైతులు మాత్రం నానా తంటాలు పడుతున్నారు.అధికార యంత్రాంగం చేయాల్సిన పనిని రైతులే తమ భుజాలపై వేసుకొని భగీరథ ప్రయత్నంతో సాధించుకుంటున్నారు.ఇదీ ములుగు జిల్లా తాడ్వాయి మండల పరిధిలోని నర్సాపురం కట్టువాగు దుస్థితి. వాగుపై పూర్తిస్థాయి ఆనకట్ట లేకపోవడంతో విలువైన నీరంతా వృథాగా పోతుండగా,రైతులు పాత చీరలతో గుడ్డ సంచులు కుట్టి, వాటిలో ఇసుక నింపి తాత్కాలిక అడ్డుకట్ట నిర్మించి నీటిని నిల్వ చేసుకుంటున్నారు.రైతుల కష్టం ఫలించి ప్రస్తుతం నీరు పంట పొలాలకు మళ్లుతుండటంతో వారి కళ్లల్లో ఆనందం కనిపిస్తోంది.అయితే రైతుల శ్రమకు తాత్కాలిక ఉపశమనం లభించినా..శాశ్వత పరిష్కారం మాత్రం ఎండమావిగానే మిగిలింది.

**గుడ్డ సంచులే అడ్డుకట్ట.. రైతులే కూలీలు..!**

తాడ్వాయి మండల కేంద్రం నుంచి కాటాపురం మీదుగా ఏటూరునాగారం వైపు వెళ్లే ప్రధాన రహదారి సమీపంలో ప్రవహించే నర్సాపురం కట్టువాగు రైతులకు కీలకమైన సాగునీటి వనరు. ఐదు గ్రామాల్లో వందలాది ఎకరాల పంటలకు ఈ వాగు నీరు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానిక రైతులు చెబుతున్నారు. అయితే వాగుపై సరైన ఆనకట్ట, నీటిని నిల్వ చేసే పటిష్టమైన ఏర్పాట్లు లేకపోవడంతో ప్రవాహం అంతా దిగువకు వెళ్లిపోతోంది.దీంతో సాగునీటి కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చివరకు రైతులే నడుం బిగించారు. పాత చీరలతో గుడ్డ సంచులు తయారుచేసి,వాటిలో ఇసుక నింపి వాగుపై అడ్డుకట్ట వేశారు. ఒక్కోసారి సుమారు 500 ఇసుక బస్తాలను ఉపయోగిస్తూ నీటిని నిల్వ చేసుకునేందుకు శ్రమించారు. చిన్నాపెద్దా తేడా లేకుండా గ్రామ రైతులంతా కలిసికట్టుగా చేసిన ఈ ప్రయత్నం ఫలించింది.వృథాగా పోతున్న నీటిని నిలిపి, కాలువల ద్వారా పంట పొలాలకు మళ్లించగలిగారు.ప్రభుత్వ శాఖలు చేయాల్సిన పనిని రైతులే స్వచ్ఛందంగా చేపట్టాల్సిన పరిస్థితి నెలకొనడం పాలకుల పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

**రైతుల కష్టం కనిపించడం లేదా...?**

నర్సాపురం కట్టువాగు సమస్య అధికారులకు,ప్రజాప్రతినిధులకు తెలియదా..? ఏళ్లుగా సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతుల గోడు వినిపించడం లేదా..? ప్రధాన రహదారి పక్కనే వాగు ప్రవహిస్తూ, నీరు వృథాగా పోతున్నా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదన్న ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ప్రతి సీజన్‌లో రైతులే ఇసుక బస్తాలతో అడ్డుకట్టలు వేసుకోవాల్సి వస్తే సంబంధిత శాఖల బాధ్యత ఏమిటని అన్నదాతలు నిలదీస్తున్నారు.రైతుల శ్రమతో నీరు నిలిచిందని సంతోషపడాలా..ప్రభుత్వ యంత్రాంగం స్పందించకపోవడంపై ఆవేదన చెందాలా అన్న పరిస్థితి నెలకొంది. తాత్కాలిక అడ్డుకట్టలతో ఎన్నాళ్లు సాగు చేయాలి..? భారీ వర్షాలు వచ్చినప్పుడు ఈ ఏర్పాటు ఎంతవరకు నిలుస్తుంది..? పంటలకు నిరంతర సాగునీరు అందేలా శాశ్వత నిర్మాణాలు చేపట్టాల్సిన అవసరం లేదా..? అన్న ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది.

**ఆనకట్ట ఎత్తు పెంచాలి..**

**షట్టర్లు ఏర్పాటు చేయాలి..!**

నర్సాపురం కట్టువాగుపై ఉన్న నిర్మాణాన్ని పరిశీలించి ఆనకట్ట ఎత్తు పెంచడంతో పాటు,తూములకు నూతన షట్టర్లు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.నీటిని అవసరమైన మేరకు నిల్వ చేసి, సాగు అవసరాలకు అనుగుణంగా కాలువలకు మళ్లించేలా పటిష్టమైన వ్యవస్థను నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ఈ పనులకు సుమారు రూ.60 లక్షల నుంచి రూ.1.5 కోట్ల వరకు వ్యయం అయ్యే అవకాశం ఉందని స్థానిక మేధావులు, కాంట్రాక్టర్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నట్లు సమాచారం.అయితే వాస్తవ వ్యయాన్ని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు సాంకేతిక పరిశీలన అనంతరం నిర్ధారించాల్సి ఉంది.ప్రస్తుతం వర్షాలు లేని సమయంలోనే పనులు ప్రారంభిస్తే ఏప్రిల్, మే నెలల నాటికి పూర్తి చేసే అవకాశం ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.తద్వారా వర్షాకాలం, తదుపరి సాగు అవసరాలకు నీటిని సమర్థంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

**ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించేనా...?**

రైతులు తమ చెమటను ధారపోసి నీటిని నిలుపుకుంటుంటే ప్రభుత్వం, సంబంధిత అధికారులు మాత్రం శాశ్వత పరిష్కారం చూపాల్సిన బాధ్యత నుంచి తప్పించుకోరాదని స్థానికులు కోరుతున్నారు. నర్సాపురం కట్టువాగును సంబంధిత అధికారులు,ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన నిధులు మంజూరు చేసి ఆనకట్ట అభివృద్ధి పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రైతుల చేతులతో నిర్మించిన ఇసుక బస్తాల అడ్డుకట్ట తాత్కాలికంగా నీటిని నిలిపింది.. మరి ప్రభుత్వ చర్యలు శాశ్వతంగా సాగునీటిని అందిస్తాయా...? నర్సాపురం కట్టువాగుకు మోక్షం కల్పించి అన్నదాతల కష్టాలు తీర్చే బాధ్యత ఎవరిది..? అన్నదే ఇప్పుడు రైతుల ముందున్న ప్రశ్న..!



## కొలువుదీరిన దుర్గమ్మ.. కొప్పులలో నవరాత్రి శోభ!

- **సాంబశివ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం**
- **వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ప్రత్యేక పూజలు..**
- **భక్తిశ్రద్ధలతో తరలివచ్చిన గ్రామస్తులు**

**శాయంపేట, అక్టోబర్ 11, డి డి 9వార్త**

హన్మకొండ జిల్లా శాయంపేట మండలంలోని కొప్పుల గ్రామంలో సాంబశివ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ దుర్గా మాత నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి.నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారి విగ్రహాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించి.వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.ఉత్సవాల తొలి రోజున శ్రీనాథ్-రామాదేవి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.పుష్పాలు సమర్పించి భక్తితో మొక్కులు చెల్లించుకున్నారు.తమ కుటుంబంతో పాటు గ్రామ ప్రజలందరికీ సుఖసంతోషాలు,ఆయురారోగ్యాలు కలగాలని దుర్గామాతను ప్రార్థించారు. అమ్మవారి సన్నిధిలో భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. సాంబశివ దేవాలయ అర్చకులు సోమేశ్వర స్వామి,కోటి,ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు.నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజూ అమ్మవారికి ప్రత్యేక పూజలు,వివిధ భక్తి కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దుర్గామాత ఆశీస్సులు పొందాలని కమిటీ సభ్యులు కోరారు. దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు గ్రామ ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు ఐకమత్యాన్ని చాటుతున్నాయి. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు సమన్వయంతో కృషి చేస్తున్నారు .ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు,భవాని మాలాధారణ స్వాములు పెద్ద సంఖ్య లో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ తోనే జవహర్ నగర్ అభివృద్ధి సాధ్యం
## డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్

- **కాంగ్రెస్ పార్టీలో చేరిన జవహర్ నగర్ కు చెందిన పలు పార్టీల నాయకులు**

**జవహర్ నగర్, అక్టోబర్ 10 (డీడీ 9 వార్త):**

జవహర్ నగర్ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రయాదవ అన్నారు. ఆదివారం జవహర్ నగర్ కు చెందిన పలు పార్టీల నాయకులు జవహర్ నగర్ మాజీ మేయర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు శాంతి కోటేష్ గౌడ్,చంద్రపురి డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో పలువురు నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ లో చేరిన పల్లె సత్యం వంశరాజ్, మాజీ ఎంపీటీసీ పల్లె లక్ష్మి, బండపల్లి కృష్ణగౌడ్, రాజకుమార్,మల్లికార్జున్ తదితరులు కాంగ్రెస్ కండువ కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. నిరుపేదలకు అభివృద్ధి సంక్షేమ పథకాలను అందించే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని అభివృద్ధిని చూసి ఇతర పార్టీల నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు.అలాంటి నాయకులకు సముచిత స్థానాన్ని కల్పించి అభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు బల్లి శ్రీనివాస్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, ఎస్సీ సెల్ ఏ బ్లాక్ అధ్యక్షులు మాట్లా శ్రీనివాస్,మాజీ యూత్ అధ్యక్షులు మాట్లా వినయ్, జవహర్ నగర్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ కొలిపాక సాయి కిరణ్,గడ్డం శ్రీనివాస్, నాయకం భాస్కర్,కాలేషా, విజయ్ రాయ్,రఫీక్, వీర భాస్కర్,రాహుల్,సోమేష్, కొలిపాక తదితరులు పాల్గొన్నారు.



## చంద్రపురి కాలనీ డివిజన్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కందం రాహుల్

**జవహర్ నగర్, అక్టోబర్ 11 (డీడీ 9 వార్త ):**

చంద్రపురి కాలనీ డివిజన్ లో కాంగ్రెస్ పార్టీని ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నాయకులు కందం రాహుల్ ను నియమిస్తూ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆదివారం నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పనిచేయాలి. ఎస్సీ సెల్ ను గ్రామ స్థాయి నుండి బలోపేతం చేయాలి" అని దిశానిర్దేశం చేశారు.

రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలి అన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కందం రాహుల్ మాట్లాడుతూ.... నాపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షులు వజ్రేష్ యాదవ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు చెన్నయ్య, డివిజన్ అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, మాజీ ,డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ గుప్తా, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు బల్లి శ్రీనివాస్, ఏ బ్లాకు ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్ ,మాట్లా వినయ్ కుమార్, వెంకటేశ్, భాస్కర్, సోమేష్ చారి,కాలేశా ,రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

# టెస్టుల్లో చరిత్ర సృష్టించిన బంగ్లాదేశ్ పేసర్

- టెస్ట్ క్రికెట్‌లో హ్యాట్రిక్ సాధించిన బంగ్లాదేశ్ పేసర్ హసన్ మహమూద్
- ఈ ఘనత సాధించిన తొలి బంగ్లా ఫాస్ట్ బౌలర్‌గా రికార్డు
- అబుదాబిలో ఆఫ్ఘనిస్థాన్‌తో జరుగుతున్న టెస్టులో ఈ అరుదైన ఫీట్
- మొత్తం 5 వికెట్లు పడగొట్టి.. అత్యంత వేగంగా 50 వికెట్లు పూర్తి



**డీడీ9 వార్త :**


బంగ్లాదేశ్ యువ ఫాస్ట్ బౌలర్ హసన్ మహమూద్ టెస్ట్ క్రికెట్‌లో చరిత్ర సృష్టించాడు. ఆఫ్ఘనిస్థాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచ్‌లో హ్యాట్రిక్ వికెట్లు పడగొట్టి సంచలనం సృష్టించాడు. ఈ ఘనత సాధించిన తొలి బంగ్లాదేశ్ ఫాస్ట్ బౌలర్‌గా, దేశం తరఫున మూడో బౌలర్‌గా అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. బంగ్లా జట్టు తరఫున టెస్టుల్లో ఇప్పటివరకు ఇద్దరు స్పిన్నర్లు మాత్రమే హ్యాట్రిక్ సాధించగా, ఓ పేసర్ ఈ ఫీట్ అందుకోవడం ఇదే తొలిసారి. అబుదాబిలోని షేక్ జాయెద్ స్టేడియంవేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్ మూడో రోజైన ఆదివారం ఈ అద్భుతం చోటుచేసుకుంది. బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 346 పరుగులకు ఆలౌట్ కాగా, బదులుగా బ్యాటింగ్ చేస్తున్న ఆఫ్ఘనిస్తాన్ 220/5 స్కోరుతో నిలిచిన దశలో 26 ఏళ్ల హసన్‌మహమూద్ విజృంభించాడు.

ఇన్నింగ్స్ 83వ ఓవర్‌లో వరుస బంతుల్లో ముగ్గురు బ్యాటర్లను పెవిలియన్‌కు పంపాడు. తొలుత ఇస్మత్ ఆలమ్‌ను (1) క్లీన్ బౌల్డ్ చేశాడు. ఆ తర్వాతి బంతికే ఖైస్ అహ్మద్‌ను వికెట్ కీపర్ లిట్టన్ దాస్ అద్భుతమైన క్యాచ్ ద్వారా ఔట్ చేశాడు. ఇక మూడో బంతికి జియాఉర్‌రెహ్మాన్‌ను ఎల్బీడబ్ల్యూగా ఔట్ చేసి హ్యాట్రిక్ పూర్తి చేశాడు. హసన్ మహమూద్ కంటే ముందు బంగ్లాదేశ్ తరఫున లెగ్ స్పిన్నర్ అలోక్ కపాలి (2003లో పాకిస్థాన్‌పై), ఆఫ్ స్పిన్నర్ సొహాగ్ గాజీ (2013లో న్యూజిలాండ్‌పై) మాత్రమే టెస్టుల్లో హ్యాట్రిక్ సాధించారు. ఈ మ్యాచ్‌లో హసన్ మరో ఘనత కూడా అందుకున్నాడు. ఆఫ్ఘన్ ఇన్నింగ్స్‌లో చివరి వికెట్‌ను పడగొట్టి ఐదు వికెట్ల హాల్‌ను పూర్తి చేశాడు.

దీంతో టెస్టుల్లో 50 వికెట్ల మైలురాయిని కూడా చేరుకున్నాడు. బంగ్లాదేశ్ తరఫున అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన పేసర్‌గా నిలిచాడు. హసన్ మహమూద్ దెబ్బకు ఆఫ్ఘనిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 240 పరుగులకే కుప్పకూలింది. దీంతో బంగ్లాదేశ్‌కు 106 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

# వందేళ్ల బంధానికి గుర్తుగా.. భారత్‌తో సిరీస్‌కు కివీస్ ప్రత్యేక జెర్సీ

- భారత్‌తో వన్డే సిరీస్‌కు న్యూజిలాండ్ ప్రత్యేక జెర్సీ
- ఇరు దేశాల క్రీడా బంధానికి 100 ఏళ్లు పూర్తి
- భారతీయ, మయోరీ సంస్కృతుల కలయికతో డిజైన్
- 'కోటహితాంగ' పేరుతో పరిమిత సంఖ్యలో జెర్సీల విడుదల
- అక్టోబర్ 22 నుంచి భారత్, న్యూజిలాండ్ సిరీస్ ప్రారంభం



**డీడీ9 వార్త :**

భారత్, న్యూజిలాండ్ దేశాల మధ్య క్రీడా సంబంధాలు ప్రారంభమై 100 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కివీస్ జట్టు ఒక ప్రత్యేకమైన జెర్సీతో మైదానంలోకి దిగనుంది. త్వరలో భారత్‌తో జరగనున్న వన్డే సిరీస్‌లో న్యూజిలాండ్ ఆటగాళ్లు ఈ పరిమిత ఎడిషన్ జెర్సీని ధరించనున్నారు. ఇరు దేశాల మధ్య ఉన్న చారిత్రక బంధం, సాంస్కృతిక సంబంధం, పరస్పర గౌరవాన్ని చాటిచెప్పేలా ఈ జెర్సీని రూపొందించారు. దీనికి 'కోటహితాంగ వన్డే షర్ట్' అని పేరు పెట్టారు. అక్టోబర్ 22 నుంచి ఈ సిరీస్ ప్రారంభం అవుతుంది.

ఈ జెర్సీ డిజైన్‌ను మయోరీ కళాకారుడు బెన్ థామసన్, భారత సంతతికి చెందిన కళాకారులు శివ్ నారందాస్, జై పంచా కలిసి రూపొందించారు. మయోరీ, భారతీయ కళా సంప్రదాయాలను అద్భుతంగా మేళవించి, ఇరు దేశాల చారిత్రక బంధాన్నిప్రతిబింబించేలా దీనిని తీర్చిదిద్దారు. మయోరీ సంస్కృతికి చెందిన 'కోవైవై' నమూనాలతో పాటు, భారత జాతీయ పుష్పమైన కమలం, భారతీయ వాస్తుశిల్పంలోని 'ఓగీ' నమూనా, 'మండల' ఆర్ట్‌ను ఈ జెర్సీలో పొందుపరిచారు.

ఈ సందర్భంగా న్యూజిలాండ్ క్రికెట్ (ఎన్‌జడ్‌సీ) చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ గ్లెన్ క్రిచ్లీ మాట్లాడుతూ.. ఈ డిజైన్ తమను ఎంతగానో ఆకట్టుకుందని తెలిపారు. "వేర్వేరు సంస్కృతులను క్రీడలు ఏకం చేస్తాయని చెప్పడానికి ఇది ఒక నిదర్శనం. ఈ జెర్సీ భారత్, న్యూజిలాండ్ అభిమానులకు ఒక అపురూప జ్ఞాపకంగా నిలిచిపోతుందని ఆశిస్తున్నాం" అని ఆయన అన్నారు. ఐక్యత (కోటహితాంగ) అనేదే ఈ డిజైన్‌కు మార్గనిర్దేశం చేసిందని కళాకారుడు బెన్ థామసన్ వివరించారు. అభిమానులు ఈ జెర్సీని గర్వంగా ధరిస్తారని ఆశిస్తున్నానని మరో కళాకారుడు శివ్ నారందాస్ పేర్కొన్నారు.

# అంతర్జాతీయ బాలికా దినోత్సవం వేళ.. స్మృతి మంధానకు ప్రత్యేక గౌరవం

- యునిసెఫ్ ఇండియా సెలబ్రిటీ అడ్వకేట్‌గా క్రికెటర్ స్మృతి మంధాన
- అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఈ నియామకం
- బాలికలకు సమాన అవకాశాలు, ఆరోగ్యం కోసం ప్రచారం చేయనున్న స్మృతి
- స్మృతి ప్రస్థానం ఎందరో బాలికలకు స్ఫూర్తిదాయకమన్న యునిసెఫ్
- ఇటీవలే భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన మంధాన



**డీడీ9 వార్త :**

భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్, స్టార్ బ్యాటర్ స్మృతి మంధానకు అరుదైన గౌరవం దక్కింది. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐక్యరాజ్యసమితికి చెందిన యునిసెఫ్ ఇండియా ఆమెను తమ 'సెలబ్రిటీ అడ్వకేట్'గా నియమించింది. ఈ కొత్త బాధ్యతలో భాగంగా బాలికల హక్కులు, భద్రత, వారి సామర్థ్యాన్ని ప్రోత్సహించడంతో పాటు క్రీడల్లో బాలికలకు సమాన అవకాశాలు కల్పించేందుకు స్మృతి కృషి చేస్తుంది. బాలికల ఆరోగ్యం, శ్రేయస్సు, సాధికారత కోసం యునిసెఫ్ ఇండియా చేపట్టే కార్యక్రమాలకు మంధాన మద్దతుగా నిలవనుంది.

ఈ నియామకంపై స్మృతి మంధాన హర్షం వ్యక్తం చేసింది. "యునిసెఫ్ ఇండియా సెలబ్రిటీ అడ్వకేట్‌గా చేరడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. క్రికెట్ ఆడుతూ పెరిగిన నాకు, ప్రతి కల ఒక అవకాశంతోనే మొదలవుతుందని తెలిసింది. కఠోర శ్రమ, పట్టుదల, ప్రోత్సాహం ఉంటే ఆ అవకాశాన్ని అద్భుతంగా మార్చుకోవచ్చు. ప్రతి చిన్నారి, యువత పెద్ద కలలు కని, వారి పూర్తి సామర్థ్యాన్ని చేరుకునే అవకాశం పొందాలి" అని ఆమె పేర్కొంది. గతంలో కూడా స్మృతి లింగ సమానత్వంపై యునిసెఫ్‌ఐసీసీ నిర్వహించిన ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంది. యునిసెఫ్ ఇండియా ప్రతినిధి సింథియా మెక్‌కాఫ్రే మాట్లాడుతూ.. స్మృతి నియామకంపై ఆనందం వ్యక్తం చేశారు. "ఒక యువ అథ్లెట్‌గా ప్రయాణం మొదలుపెట్టి, ప్రపంచ స్థాయి క్రికెట్ ఐకాన్‌గా ఎదిగిన స్మృతి ప్రస్థానం.. ప్రతిభకు అవకాశం తోడైతే ఏం సాధించవచ్చో బాలికలకు నిరూపిస్తుంది. ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా ఉన్న భారత్‌లో, బాలికల హక్కులు, నాయకత్వం, శ్రేయస్సుపై పెట్టుబడి పెట్టడమే దేశానికి అత్యంత తెలివైన పెట్టుబడి. ప్రతి బాలిక నేర్చుకోవడానికి, ఆడటానికి, నాయకత్వం వహించడానికి, తన సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి స్మృతితో కలిసి పనిచేయాలని ఎదురుచూస్తున్నాం" అని వివరించారు.

ఇటీవలే హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీ నుంచి తప్పుకోవడంతో స్మృతి మంధాన జట్టు పగ్గాలు చేపట్టిన విషయం తెలిసిందే. 2025లో తొలిసారిగా ఐసీసీ మహిళల క్రికెట్ ప్రపంచ కప్ గెలిచిన భారత జట్టులో ఆమె కీలక సభ్యురాలు. అదే ఏడాది, ఒక క్యాలెండర్ ఇయర్‌లో 1,000 వన్డే పరుగులు చేసిన తొలి మహిళా క్రికెటర్‌గా రికార్డు సృష్టించింది.

2026 నాటికి మహిళల అంతర్జాతీయ క్రికెట్, టీ20 ఫార్మాట్లలో అత్యధిక పరుగులు చేసిన క్రీడాకారిణిగా ఆమె నిలిచింది. ప్రస్తుతం మహిళల వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్న స్మృతి, అర్జున అవార్డు గ్రహీత, అలాగే రెండుసార్లు 'ఐసీసీ ఉమెన్స్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్' అవార్డును కూడా గెలుచుకుంది.

# అచ్చం నాలాగే ఆలోచిస్తున్నాడు

- తొలి బంతి నుంచే దాడి చేయాలనే ఆలోచన తనలాంటిదేనని వ్యాఖ్య
- వయసుతో సంబంధం లేకుండా ప్రదర్శన ఆధారంగా ఎంపిక చేయాలని సూచన
- ప్రస్తుతం వైభవ్ తన ప్రైమ్ ఫామ్‌లో ఉన్నాడని కితాబు
- శుభమన్ గిల్, జస్‌ప్రీత్ బుమ్రా ఫామ్‌పైనా సెహ్వాగ్ స్పందన



**డీడీ9 వార్త :**

టీమిండియా యువ క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీపై భారత మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేందర్ సెహ్వాగ్ ప్రశంసల వర్షం కురిపించాడు. తొలి బంతి నుంచే దూకుడుగా ఆడాలనే ఆలోచనా విధానం అచ్చం తనలాగే ఉందని, 15 ఏళ్ల వైభవ్ ప్రస్తుతం తన కెరీర్‌లో అత్యుత్తమ ఫామ్‌లో (ప్రైమ్‌లో) ఉన్నాడని సెహ్వాగ్ అభిప్రాయపడ్డారు. శనివారం ఢిల్లీలో జరిగిన పీహెచ్‌డీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ వార్షిక సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.


"సూర్యవంశీ ఇప్పుడు ప్రైమ్‌లో ఉన్నాడు. మొదటి బంతి నుంచే బాదాలనే ఆలోచన నాలాగే ఉంది. అతడికి ఎప్పుడు అవకాశం వస్తుంది, భారత్ తరఫున ఎన్ని మ్యాచ్‌లు ఆడతాడన్నదే ఇప్పుడు ముఖ్యం" అని సెహ్వాగ్ పేర్కొన్నాడు. జట్టు ఎంపికలో వయసు కంటే ప్రదర్శనకే ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశాడు. "అండర్19 వంటి విభాగాల్లో వయసు చూడాలి. కానీ ఐపీఎల్ లేదా టీమ్ ఇండియాలోకి వచ్చాక ప్రదర్శనే ప్రధానం. 38 ఏళ్ల విరాట్ కోహ్లీ ఆడుతున్నప్పుడు, 15 ఏళ్ల వైభవ్ కూడా ఆడగలడు" అని సెహ్వాగ్ వివరించారు.

ఇప్పటివరకు 8 టీ20 మ్యాచ్‌లు ఆడిన వైభవ్ సూర్యవంశీ, 186 స్ట్రైక్ రేట్‌తో 246 పరుగులు సాధించాడు. అయితే, భారత జట్టులో ఓపెనింగ్ స్థానాలకు సంజూ శాంసన్, అభిషేక్ శర్మల నుంచి గట్టి పోటీ నెలకొంది. ఈ నేపథ్యంలో యువ ఆటగాళ్లు ఓపికతో ఉండాలని మాజీ ఆల్‌రౌండర్ రాబిన్ సింగ్ సూచించారు.

ఇదే కార్యక్రమంలో సెహ్వాగ్ మాట్లాడుతూ.. వన్డేల్లో రెండో డబుల్ సెంచరీ సాధించిన శుభమన్ గిల్‌ను అభినందించాడు. అలాగే, 2027 వన్డే ప్రపంచకప్‌లో జస్‌ప్రీత్ బుమ్రా వంటి పదునైన బౌలింగ్ దళం ఉంటే భారత్ కప్ గెలవడం సులభమని జోస్యం చెప్పారు.

# భారత్‌తో వన్డే సిరీస్‌కు న్యూజిలాండ్ జట్టు ప్రకటన.. ఫెర్గూసన్ రీఎంట్రీ

- భారత్‌తో వన్డే సిరీస్‌కు జట్టును ప్రకటించిన న్యూజిలాండ్ బోర్డు
- చాలాకాలం తర్వాత జట్టులోకి వచ్చిన లాకీ ఫెర్గూసన్, ఫిన్ అలెన్
- గాయం నుంచి కోలుకుని తొలి 3 మ్యాచ్‌లకు అందుబాటులోకి రచిన్ రవీంద్ర
- సిరీస్‌లోని తొలి 3, చివరి 2 మ్యాచ్‌లకు వేర్వేరు జట్లను ఎంపిక చేసిన కివీస్
- నవంబర్ 4 నుంచి ఇరు జట్ల మధ్య 5 మ్యాచ్‌ల వన్డే సిరీస్ ప్రారంభం



**డీడీ9 వార్త :**

భారత్‌తో త్వరలో జరగనున్న 5 మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం న్యూజిలాండ్ క్రికెట్ (ఎన్‌జడ్‌సీ) తమ జట్టును ప్రకటించింది. ఈ సిరీస్‌కు వైట్‌బాల్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ నాయకత్వం వహించనున్నాడు. స్టార్ పేసర్ లాకీ ఫెర్గూసన్, ఫిన్ అలెన్, టిమ్ సైఫర్ట్ చాలాకాలం తర్వాత తిరిగి వన్డే జట్టులోకి రావడం విశేషం. గాయం కారణంగా గత టీ20 సిరీస్‌కు దూరమైన యువ ఆల్‌రౌండర్ రచిన్ రవీంద్ర కోలుకుని, తొలి మూడు మ్యాచ్‌లకు అందుబాటులోకి వచ్చాడు. నవంబర్ 4న ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్‌లో తొలి మ్యాచ్‌తో ఈ సిరీస్ ప్రారంభం కానుంది. ఈ ఏడాది జనవరిలో భారత్ గడ్డపై చారిత్రక వన్డే సిరీస్ (21) గెలిచిన కివీస్, అదే జోరును సొంతగడ్డపై కొనసాగించాలని భావిస్తోంది. అయితే, ఈ సిరీస్ తర్వాత భారత్‌తోనే టెస్ట్ సిరీస్ ఉన్న నేపథ్యంలో, ఆటగాళ్లపై భారం తగ్గించేందుకు కివీస్ బోర్డు ఓ ప్రయోగాత్మక నిర్ణయం తీసుకుంది. సిరీస్‌లోని తొలి మూడు వన్డేలకు ఒక జట్టును, చివరి రెండు వన్డేలకు మరో జట్టును ఎంపిక చేసింది.

తొలి మూడు మ్యాచ్‌ల తర్వాత కొంతమంది ఆటగాళ్లు టెస్ట్ సిరీస్ సన్నాహకాల కోసం వెల్లింగ్‌టన్‌కు వెళ్తారని, వారి స్థానంలో మరో ఏడుగురు ఆటగాళ్లు జట్టుతో చేరతారని హెడ్ కోచ్ రాబ్ వాల్టర్ తెలిపాడు. "భారత్ వంటి బలమైన జట్టుతో ఆడటం మాకు పెద్ద సవాల్. ఏడాది దూరంలో ఉన్న వన్డే ప్రపంచకప్‌కు ఈ సిరీస్ సన్నాహకంగా ఉపయోగపడుతుంది. ఫెర్గూసన్, అలెన్ వంటి మ్యాచ్ విన్నర్లు తిరిగి రావడం జట్టుకు బలం చేకూరుస్తుంది" అని అన్నాడు.

గాయాల కారణంగా జాక్ ఫౌల్క్స్, విల్ ఓ'రూర్క్, బెన్ సియర్స్‌లను సెలక్షన్‌కు పరిగణనలోకి తీసుకోలేదని బోర్డు వెల్లడించింది. భారత్‌తో టెస్ట్ సిరీస్‌కు సంబంధించిన జట్టును నవంబర్ ఆరంభంలో ప్రకటించే అవకాశం ఉంది.

# దుబాయ్‌లో పఠాన్ బ్రదర్స్‌కు రషీద్ ఖాన్ గ్రాండ్ ట్రీట్.. ఆతిథ్యానికి ఇర్ఫాన్ ఫిదా..

- పఠాన్ సోదరులకు దుబాయ్‌లో ఆఫ్ఘన్ విందు ఇచ్చిన రషీద్ ఖాన్
- ప్రస్తుతం కుటుంబంతో కలిసి దుబాయ్‌లో ఇర్ఫాన్ పఠాన్ విహారయాత్ర
- రషీద్ ఆతిథ్యం అద్భుతమంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఇర్ఫాన్ పోస్ట్
- కాబూలీ పులావ్, మంటూ వంటి సంప్రదాయ వంటకాలతో గ్రాండ్ ట్రీట్
- రషీద్, ఆయన భార్యకు కృతజ్ఞతలు తెలిపిన ఇర్ఫాన్ పఠాన్



**డీడీ9 వార్త :**

ఆఫ్ఘనిస్థాన్ స్టార్ క్రికెటర్, స్పిన్ మాంత్రికుడు రషీద్ ఖాన్ తన గొప్ప మనసును చాటుకున్నాడు. టీమిండియా మాజీ ఆల్‌రౌండర్లు ఇర్ఫాన్ పఠాన్, యూసుఫ్ పఠాన్‌లకు దుబాయ్‌లోని తన నివాసంలో ఘనమైన విందు ఇచ్చాడు. ఆఫ్ఘనిస్థాన్ సంప్రదాయ వంటకాలతో వారికి మర్చిపోలేని ఆతిథ్యం అందించి తన స్నేహాన్ని ప్రదర్శించాడు. ప్రస్తుతం ఇర్ఫాన్ పఠాన్ తన కుటుంబంతో కలిసి దుబాయ్‌లో విహారయాత్రలో ఉన్నాడు. ఈ విషయం తెలుసుకున్న రషీద్ ఖాన్, పఠాన్ సోదరులను ప్రత్యేకంగా తన ఇంటికి ఆహ్వానించాడు.


ఈ అద్భుతమైన విందుకు సంబంధించిన వివరాలను ఇర్ఫాన్ పఠాన్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకున్నాడు. రషీద్ ఖాన్, ఆయన భార్య లయ్‌లోమా అందించిన ఆతిథ్యానికి ముగ్ధుడయ్యాడు. "ఇది ఒక నమ్మశక్యంకాని ఆఫ్ఘన్ విందు. ప్రతి వంటకానికి దాని ప్రత్యేకమైన రుచి ఉంది. వారు ఎంతో ఆప్యాయతతో వండి వడ్డించారు. ఆ రుచిని ఇప్పటికీ మర్చిపోలేకపోతున్నాను" అంటూ ఇర్ఫాన్ తన పోస్టులో పేర్కొన్నాడు. ఈ సందర్భంగా ఇర్ఫాన్ పంచుకున్న వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఈ విందులో ఆఫ్ఘనిస్థాన్ సంప్రదాయ వంటకాలైన 'కాబూలీ పులావ్', 'మంటూ' వంటివి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మాంసంతో పాటు క్యారెట్లు, ఎండుద్రాక్షతో కలిపి వండే రైస్ వెరైటీని కాబూలీ పులావ్ అంటారు. అలాగే, మాంసం లేదా కూరగాయలతో నింపి, ఆవిరిపై ఉడికించి, పెరుగు, టమాటో సాస్‌తో వడ్డించే వంటకాన్ని 'మంటూ'గా పిలుస్తారు. ఈ రుచికరమైన వంటకాలను పఠాన్ సోదరులు ఆస్వాదిస్తున్న దృశ్యాలు వీడియోలలో కనిపించాయి. రషీద్ ఖాన్, ఇర్ఫాన్ పఠాన్‌ల మధ్య మంచి స్నేహబంధం ఉంది. వారు తరచుగా సోషల్ మీడియాలో ఒకరినొకరు అభినందించుకుంటూ ఉంటారు. తాజాగా ఈ విందు వారి స్నేహాన్ని మరింత బలపరిచింది. దేశాల మధ్య హద్దులు ఉన్నా, క్రీడాకారుల మధ్య స్నేహానికి అవేవీ అడ్డుకావని ఈ సంఘటన నిరూపిస్తోంది.

## హలో... ఇది ఆరంభమే

భాషతో సంబంధం లేకుండా విభిన్నమైన కథలతో ప్రేక్షకుల్ని అలరిస్తుంటారు అందాల తార మమితా బైజు. ఇటీవలే 'విశ్వనాథ్ అండ్ సన్స్', 'బెల్లెహోమ్ కుటుంబ యూనిట్' లాంటి చిత్రాలతో బాక్సాఫీసు వద్ద మంచి విజయాన్ని అందుకున్నారు. ప్రస్తుతం వరుస సినిమాలతో మంచి జోరుమీదున్న ఈ భామ 'హలో డియర్'లో నటిస్తున్న సంగతి తెలిసిందే. మమిత, సంగీత్ ప్రతాప్ ప్రధాన పాత్రల్లో రూపొందుతున్న చిత్రమిది. ఈ సినిమా జనవరి 29న థియేటర్లలోకి రాబోతుందని అధికారికంగా ప్రకటిస్తూ... సామాజిక మాధ్యమాల వేదికగా ఒక కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు మమిత.

ఈ నేపథ్యంలో "హలో' అనేది కేవలం ఆరంభం మాత్రమే. ఆ తర్వాత జరిగే ప్రతిదానిలోనే అసలైన మ్యాజిక్ ఉంది" అనే క్యాప్షన్‌ను జోడించారు. డినోయ్ పాలోస్ దర్శకత్వంలో ఆషిక్ ఉస్మాన్ నిర్మిస్తున్నారు. ఈ పోస్టర్‌లో మమితా, సంగీత్ సరదాగా నవ్వుతూ కబుర్లు చెప్పుకుంటూ నడుస్తూ కనిపించిన తీరు సినీప్రియుల్ని ఆకట్టుకుంది.

అనుకోకుండా వచ్చిన ఒక ఫోన్ కాల్ తర్వాత.. ఓ జంట గందరగోళ సంఘటనల్లో చిక్కుకోవడమే ఈ చిత్ర కథాంశమని సినీవర్గాలు తెలిపాయి. ప్రస్తుతం మమిత 'ఇరందు వానమ్'లో నటిస్తున్నారు.



## రొమాంటిక్ రైడ్‌కు రంగం సిద్ధం..

బాలీవుడ్‌లో విలక్షణమైన పాత్రలు ఎంచుకుంటూ, తన నటనతో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న నటి భూమి పెడ్నేకర్. డిఫరెంట్ కాన్సెప్ట్ సినిమాలు చేస్తూ ప్రశంసలు అందుకున్న ఈ టాలెంటెడ్ బ్యూటీ.. ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమయ్యారు. ఇమ్రాన్ ఖాన్ గ్రాండ్ రీఎంట్రీ ఇస్తున్న క్రేజీ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'అధురే హమ్ అధురే తుమ్' చిత్రంలో భూమి పెడ్నేకర్ హీరోయిన్‌గా నటిస్తున్నట్లు సమాచారం. 'కభీ కభీ అదితి జిందగీ మే..' పాటతో మిల్లీనియల్స్ మనసు దోచుకున్న ఇమ్రాన్ ఖాన్ చాలా కాలం తర్వాత మెయిన్ లీడ్ రోల్‌లో కనిపిస్తుండగా.. భూమి పెడ్నేకర్ పెర్ఫార్మెన్స్, ఆమె క్యారెక్టర్ ఈ సినిమాకు మెయిన్ హైలైట్‌గా నిలవనుందని తెలుస్తోంది.

వైవిధ్యమైన స్క్రిప్టులు ఎంచుకోవడంలో పేరుగాంచిన భూమి, ఇమ్రాన్ కాంబినేషన్ తెరపై కొత్త మ్యాజిక్ క్రియేట్ చేయబోతోందని టాక్ నడుస్తోంది. ఈ చిత్రంలో గూర్ఖతేహ పీర్జాద కీలక పాత్రలో కనిపిస్తుండగా, ఫేమ్ దానిష్ అస్లామ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్‌లో వచ్చిన 'హ్యాపీ పటేల్: ఖతర్నాక్ జసూస్' సినిమాలో చిన్న క్యామియో చేసిన ఇమ్రాన్.. ఇప్పుడు భూమి పెడ్నేకర్‌తో కలిసి చేయబోతున్న ఈ చిత్రం డిసెంబర్ 18న నేరుగా ఓటీటీ వేదికగా విడుదల కాబోతున్నట్లు సమాచారం.



## గ్యాంగ్‌స్టర్ మోడ్ యాక్టివేటెడ్!



ఇటీవలే 'ది ప్యారడైజ్' సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించారు కథానాయకుడు నాని. అందులో ఆయన రెండు జడలతో ఊర మాస్ లుక్‌లో అందర్నీ అలరించిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడాయన 'బ్లడీ రోమియో' కోసం పూర్తిగా స్టైలిష్ లుక్‌లోకి మారిపోయారు. 'ఓజీ' విజయం తర్వాత సుజీత్ దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ సినిమా వచ్చే వారం నుంచి చిత్రీకరణ ప్రారంభించుకోనున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే తాజాగా నానిపై ఫొటో షూట్‌ని పూర్తి చేశారు. దీనికి సంబంధించి ఓ ప్రత్యేక వీడియోను నెట్టింట పంచుకున్నారు. ''గ్యాంగ్‌స్టర్ మోడ్ యాక్టివేటెడ్.. ఇంక రచ్చ రచ్చే'' అంటూ దానికి ఓ ఆసక్తికర వ్యాఖ్యని జోడించారు. ఈ వీడియోలో నాని లుక్.. తన హెయిర్ స్టైల్ చూస్తుంటే మునుపెన్నడూ చూడని ఓ సరికొత్త స్టైలిష్ అవతారంలో సుజీత్ తనని చూపించనున్నట్లు అర్థమవుతోంది. ఇదొక వినోదాత్మకమైన గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాగా ముస్తాబు కానుంది. నాని ఇందులో చెఫ్‌గా.. గ్యాంగ్‌స్టర్‌గా రెండు కోణాల్లో సాగే పాత్రలో అలరించనున్నారు. ఈ సినిమా సింహభాగం చిత్రీకరణ విదేశాల్లో జరగనుంది. ఇందులో ప్రీతి ముకుందన్ కథానాయికగా కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

## ఆ సినిమా ఫ్లాప్ నాకు పెద్ద గుణపాఠం నేర్పింది..



భిన్నమైన కథలను, విభిన్న పాత్రలను ఎంచుకుంటూ టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరో కిరణ్ అబ్బవరం. వరుస ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్న ఆయన, ఇప్పుడు నటుడిగానే కాకుండా నిర్మాతగా, దర్శకుడిగా కూడా మారబోతూ తన మల్టీ టాలెంట్‌ను చూపిస్తున్నారు. 'గుప్పెడంత మనసు' సీరియల్‌తో ఓటీటీలోకి గ్రాండ్ ఎంట్రీ ఇవ్వడమే కాకుండా, 'రియాలిటీ' అనే సినిమాతో మెగాఫోన్ పట్టి దర్శకుడిగా మారనున్నారు. ఈ క్రమంలో తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో కిరణ్ అబ్బవరం తన కెరీర్, రాబోయే చిత్రాల గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. నేటి సమాజంలో మధ్యతరగతి యువత ఎదుర్కొంటున్న పెళ్లి ఒత్తిళ్ల నేపథ్యంలోనే 'రియాలిటీ' సినిమా కథ సాగుతుందని కిరణ్ తెలిపారు. పెళ్లి చేసుకోవాలనుకునే ఓ కుర్రాడి జీవితంలో ఎదురయ్యే సరదా సంఘటనలను ఈ చిత్రంలో వినోదాత్మకంగా చూపించబోతున్నామని చెప్పారు. ఈ సినిమా కోసం నటనతో పాటు దర్శకత్వ, రచన బాధ్యతలను కూడా తానే స్వయంగా తీసుకున్నట్లు స్పష్టం చేశారు.


గత అనుభవాల గురించి మాట్లాడుతూ.. 2023లో విడుదలైన 'మీటర్' చిత్రాన్ని ప్రేక్షకులు తిరస్కరించడం తనకు పెద్ద గుణపాఠం నేర్పిందని కిరణ్ అబ్బవరం ఓపెన్‌గా అంగీకరించారు. సినిమాల్లో కొత్తదనం లేకపోతే జనాలు ఆదరించరని తనకు అర్థమైందని, ప్రేక్షకులు ట్రోల్ చేసేలోపే మనల్ని మనం సరిదిద్దుకోవాలని అన్నారు. అందుకే ఇప్పుడు తన తదుపరి చిత్రాల విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇక తన లైనప్ గురించి చెబుతూ.. శ్రీకాంత్ పుష్పాల దర్శకత్వంలో 'ఇంద్రపుత్ర' సినిమా చేస్తున్నానని, ఇది పీరియాడిక్ చిత్రం కాకపోయినా మైథాలజీ టచ్‌తో సాగే నేటితరం కథ అని చెప్పారు. ఇందులో కత్తులు తిప్పుతూ భారీ కాస్ట్యూమ్స్‌లో కనిపించనున్నట్లు తెలిపారు. అలాగే తాను నిర్మాతగా తెరకెక్కిస్తున్న 'హత' చిత్రం ప్రేక్షకులను కచ్చితంగా ఆకట్టుకుంటుందని, సినిమా ప్రారంభమైన 15 నిమిషాల తర్వాత ఆడియెన్స్‌ను సీటు అంచున కూర్చోబెట్టేలా ఈ థ్రిల్లర్ ఉంటుందని వివరించారు. ఇక తాను

## కోలీవుడ్‌లో మరో బంపర్ ఆఫర్ దక్కించుకున్న శ్రీదేవి..

'కోర్ట్' సినిమాతో ఒక్కసారిగా ఓవర్ నైట్ స్టార్‌గా మారిన ముద్దుగుమ్మ శ్రీదేవి.. ఆ తర్వాత వచ్చిన చిత్రం అంతగా వర్కౌట్ కాకపోవడంతో టాలీవుడ్‌లో కాస్త గ్యాప్ ఇచ్చారు. అయితే ఏమాత్రం నిరుత్సాహపడకుండా చెన్నై బాట పట్టిన ఆమె.. కోలీవుడ్‌లో వరుస ఆఫర్లతో దూసుకుపోతున్నారు. ప్రస్తుతం ఆమె ఏగన్ సరసన నటించిన 'హైకూ' సినిమా అక్టోబర్ 23న థియేటర్లలో సందడి చేయడానికి రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో.. తాజాగా శ్రీదేవి తన తదుపరి కొత్త సినిమాను అఫీషియల్‌గా అనౌన్స్ చేసి సర్ప్రైజ్ ఇచ్చారు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తన కొత్త ప్రాజెక్ట్ టైటిల్‌ను రివీల్ చేస్తూ ఒక ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. 'కొంచెం మధురమైన జ్ఞాపకాలు, ఎంతో ప్రేమ, ఎప్పటికీ నిలిచిపోయే అనుభూతులు. కొన్ని కథలు ఎప్పటికీ ముగియవు.. అవి కేవలం మన జ్ఞాపకాల్లో నిలిచిపోయే క్షణం కోసం వేచి చూస్తుంటాయి. హృదయానికి దగ్గరైన, గుర్తుంచుకోవడానికి వేచి ఉన్న కథను మీకు పరిచయం చేస్తున్నాం" అంటూ చాలా క్యూట్ క్యాప్షన్ జోడించారు. ఈ చిత్రానికి 'యువర్స్ లవింగ్లీ' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఫిక్స్ చేశారు. ఇందులో ఆకాశ్ ప్రేమ్‌కుమార్ హీరోగా నటిస్తుండగా.. శ్రీదేవి ఆయన సరసన అల్లరి చూపులతో కనువిందు చేయనున్నారు.ఈ యూత్ ఫుల్ మ్యూజికల్ లవ్ స్టోరీని ముత్తురామ్ మురుగన్ డైరెక్ట్ చేస్తుండగా.. ఎంఆర్ మోషన్ పిక్చర్స్ బ్యానర్‌పై మహేష్ సెల్వరాజ్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ఆఖరి దశకు చేరుకుందని, త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుందని మేకర్స్ తెలిపారు. మొత్తానికి తమిళంలో బ్యాక్ టు బ్యాక్ ప్రాజెక్ట్స్‌తో శ్రీదేవి తన సత్తా ఏంటో నిరూపించుకుంటున్నారు.



## జెండర్‌తో సంబంధం లేదు..



'అలా మొదలైంది' సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి మంచి పాపులారిటీ సంపాదించుకున్న నటి, సింగర్ స్నిగ్ధ నయని తాజాగా చేసిన వ్యాఖ్యలు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉంటున్న ఆమె.. సింగింగ్ షోలతో పాటు సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్‌గా ఉంటున్నారు. అయితే ఇటీవల ఆమె ఓ అమ్మాయితో కలిసి పెళ్లి చేసుకున్నట్లుగా సోషల్ మీడియాలో ఓ వీడియోను షేర్ చేయడం పెద్ద సంచలనంగా మారింది. అంతేకాకుండా హనీమూన్‌కి కూడా వెళ్లడంతో ఆ వీడియోలు కాస్త వైరల్ కావడంతో నెటిజన్లు ఆమె నిజంగానే వివాహం చేసుకున్నారంటూ రకరకాలుగా చర్చించుకున్నారు. ఈ నేపథ్యంలో, తాజాగా ఒక యూట్యూబ్ చానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో స్నిగ్ధ ఈ పెళ్లి రూమర్లపై స్పందిస్తూ అసలు నిజం బయటపెట్టారు.

కేవలం సరదాగా రీల్స్ కోసం మాత్రమే ఆ వీడియో చేశానని, కానీ అందరూ దానిని నిజమైన పెళ్లి అనుకుని పొరబడ్డారని ఆమె స్పష్టం చేశారు. ఈ వీడియో చూసి తన బంధువులు కూడా నిజమేనని నమ్మి తనకు వరుసగా ఫోన్లు చేశారని గుర్తు చేసుకున్నారు. తమకు చెప్పకుండా రహస్యంగా పెళ్లి ఎందుకు చేసుకున్నావని బంధువులు నిలదీసినట్లు ఆమె తెలిపారు. ప్రస్తుతానికి తాను లెస్బియన్ కాదని, అమ్మాయినేనని క్లారిటీ ఇచ్చారు. ఇక తన మ్యారేజ్ ప్లాన్స్ గురించి మాట్లాడుతూ.. భవిష్యత్తులో తనకు మనసుకు నచ్చిన సరైన వ్యక్తి దొరికితే కచ్చితంగా పెళ్లి చేసుకుంటానని చెప్పారు. అంతేకాకుండా, జెండర్‌తో సంబంధం లేకుండా తనకు నచ్చిన వ్యక్తి అమ్మాయైనా సరే పెళ్లి చేసుకునేందుకు సిద్ధమేనని కుండబద్దలు కొట్టారు. ఒకవేళ తనకు తగిన తోడు దొరకకపోతే జీవితాంతం సింగిల్‌గానే ఉండిపోతానని స్నిగ్ధ స్పష్టం చేశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## మ్యాజిక్ చూసేందుకు ఆత్రుతగా ఎదురుచూస్తున్నా...

ఇటీవల 'పూజా మేరీ జాన్', 'డెకాయిట్' వంటి విభిన్న చిత్రాలతో ప్రేక్షకులను మెప్పించిన టాలెంటెడ్ నటి మృణాల్ ఠాకూర్.. ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌తో సందడి చేయడానికి సిద్ధమయ్యారు. బాలీవుడ్ ప్రముఖ కొరియోగ్రాఫర్, ఫిల్మ్‌మేకర్ గణేష్ ఆచార్య తన రియల్ లైఫ్ జర్నీ ఆధారంగా తెరకెక్కించిన బయోపిక్ డ్రామా 'గణేష్ డస్ట్ టు స్టార్‌డస్ట్' లో మృణాల్ భాగమయ్యారు. మాస్టర్‌జీ బయోపిక్‌లో భాగమవ్వడంపై మృణాల్ ఠాకూర్ స్పందిస్తూ సోషల్ మీడియాలో ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. 'ఈ ట్రైలర్ కేవలం అందమైన విజువల్స్ మాత్రమే కాదు మాస్టర్‌జీ.. మీ కష్టానికి, ప్యాషన్‌కు అద్దం పట్టే రిఫ్లెక్షన్ ఇది. మీ ప్రయాణంలో రెండు పాటల ద్వారా నేను కూడా భాగస్వామి కావడం చాలా సంతోషంగా ఉంది.

వెండితెరపై మీరు క్రియేట్ చేయబోయే మ్యాజిక్ చూసేందుకు ఆత్రుతగా ఎదురుచూస్తున్నాను" అని మృణాల్ రాసుకొచ్చింది. ఇక విడుదలైన ట్రైలర్ అంచనాలను పెంచుతోంది. అతి సాధారణ స్థాయి నుంచి వచ్చి, అనేక కష్టాలు, కన్నీళ్లు దాటుకుని బాలీవుడ్ టాప్ కొరియోగ్రాఫర్‌గా ఎదిగిన గణేష్ ఆచార్య జీవిత కథ ఆధారంగా రాబోతుండటం సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక ఇందులో శివాంశు సోని, అలోక్ షా, సుకన్య కలన్ ప్రధాన పాత్రలు పోషించగా, గణేష్ ఆచార్య స్వయంగా కథ, దర్శకత్వం అందించారు. వి2ఎస్ ప్రొడక్షన్& ఎంటర్‌టైన్‌మెంట్ సమర్పణలో ఆయన కుమార్తె సౌందర్య ఆచార్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జునైద్ కుమార్ సంగీతం అందించిన ఈ సినిమా డిసెంబర్ 11న థియేటర్లలోకి రాబోతున్నట్లు మృణాల్ స్పష్టం చేశారు.

This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500204. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.